



సింహాసనం కట్టపై కొలువైన మాళ మల్లేశ్వర స్వామి ఉత్సవమూర్తులు

హరహర మహాదేవ

- దేవరగట్టు పసుపు మయం
- ఆకట్టుకున్న గొరవయ్యల నృత్యం
- 51వ ప్రయత్నంలో తెగిన ఇనుప గొలుసు
- భారీగా తరలి వచ్చిన భక్తులు
- నేటితో ముగియనున్న 'బన్ని' ఉత్సవాలు



ఇనుప గొలుసు తెంపుతున్న గొరవయ్య గాదిలింగ

హొళగుంద, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేవరగట్టు మాళ మాల్లేశ్వర స్వామి ఉత్సవం వైభవంగా కొనసాగుతోంది. మంగళవారం దేవరగట్టు భక్తులతో నిండిపోయింది. భక్తుల కోలాహలం మధ్య గొరవయ్యల నృత్య ప్రదర్శన సాగింది. అనంతరం వేదపండితులు నిర్ణయించిన సమయంలో సింహాసనం కట్ట వద్ద బళ్లారుకు చెందిన రాఘవేంద్ర స్వామి ఆధ్వర్యంలో మాళమాల్లేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. గొరవయ్యల నృత్యం, డమరుక నడుమ గొలుసు తెంపే మహోత్సవం ఉత్కంఠగా జరిగింది. ఉదయం బళ్లారుకు చెందిన గొరవయ్య గాదిలింగ స్వామి ఇనుప గొలుసును 51వ ప్రయత్నంలో తెంపి అందర్నీ ఆకట్టుకున్నాడు. గొరవయ్యల నృత్య ప్రదర్శన డమరుక నాదం, శివ నామంతో దేవరగట్టు మార్మోగింది. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులతోపాటు మహిళలు, చిన్నారులు సైతం ఎగపడ్డారు. సాయంత్రం దేవదాసీల క్రీడలు సైతం ఆకర్షణీయంగా సాగాయి. బన్ని ఉత్సవాల్లో చివరి ఘట్టమైనా వసంతోత్సవంలో భక్తులపై గొరవయ్యలు రంగలను చల్లి ఘనంగా కంకణ విసర్జనను చేశారు. అనంతరం స్వామి అమ్మవారి ఉత్సవమూర్తులు గిరిపై చేరుకుంటారు. గూళ్యంకు చెందిన వీరశైవులు, దేవరగట్టులో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలూరు సీఐ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో హొళగుంద ఎస్సైలు బాల నరసింహులు, ఆలూరు ఎస్సై వెంకట నరసింహులు, బందోబస్తు ఏర్పాటు చేశారు.



బళ్లారుకు చెందిన గొరవయ్య గాదిలింగ



గొరవయ్య గాదిలింగకు ఇనుప గొలుసు అందిస్తున్న రఘువేంద్ర స్వామి



భైరవుని రూపంలో పంచామృత ప్రసాదాన్ని స్వీకరిస్తున్న గొరవయ్య విజయ్ కుమార్

మాకు వాటా ఇవ్వాల్సిందే..!

- మద్యం దుకాణాలను దక్కించుకున్న వారిపై నాయకుల ఒత్తిడి
- 30 శాతం డిమాండ్
- వారిని కాదని వ్యాపారం చేయలేని వైనం
- తప్పని పరిస్థితుల్లో ఒప్పుకుంటున్న వ్యాపారులు



నంద్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ ముగిసింది. దుకాణాలను దక్కించుకున్న వారు వ్యాపారం మొదలుపెట్టడమే తరువాయి అనుకుంటున్నారు. అయితే ఇక్కడే తిరకాసు ఉంది. దుకాణాలను దక్కించుకున్న వారిని జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల నాయకులు పిలిచి బేరాలు మొదలుపెట్టారు. వచ్చిన షాపుల్లో తమకు వాటా ఇవ్వాలని కొంతమంది, దుకాణాల్లో తమ వారికి వాటా ఇవ్వాలని కొంతమంది అడుగుతున్నారు. తమని కాదని వ్యాపారం చేయలేరని, కాబట్టి తాము అడిగింది ఇవ్వాలని ఓ నియోజకవర్గంలోని నాయకులు నేరుగా బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ఇలా కాని పక్షంలో నెలనెలా తమకు కమీషన్ ఇచ్చుకుని వ్యాపారం చేసుకోవాలని మరో నియోజకవర్గంలోని నాయకులు చెబుతున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి మద్యం దుకాణాలను దక్కించుకున్న వారు సొంతంగా వ్యాపారం చేసుకునే పరిస్థితి లేదన్న విషయం తేటతెల్లమవుతోంది.

మద్యం వ్యాపారులతో మీటింగులు..

రాష్ట్రంలో నూతన మద్యం విధానం వస్తుందనగానే జిల్లాలోని కొంతమంది నాయకులు అప్రమత్తమయ్యారు. ఎక్కువ మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు పావులు కదిపారు. ఎవరైతే మద్యం వ్యాపారంలో ఉన్నారో వారిని పిలిపించి సిండికేట్ అవుదామని నచ్చజెప్పారు. అందరం కలిసి దరఖాస్తులు వేద్దామని, తమకు తెలియకుండా దరఖాస్తులు వేయవద్దని సూచించారు. స్థానిక వ్యాపారులు, నాయకులను కాదని దరఖాస్తులు వేసినా ప్రయోజనం ఉండదని మద్యం వ్యాపారులు సరేనన్నారు. కొంతమంది నాయకులను కాదని దరఖాస్తులు వేసినా చాలా మంది మాత్రం నాయకులు చెప్పిన మాటకే కట్టుబడి సిండికేట్‌గా మారి ఆయా నియోజకవర్గాల్లో దరఖాస్తులు వేశారు. దీంతో మద్యం దుకాణాలకు దరఖాస్తులు మందకొడిగా సాగాయి. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి పోవటంతో మద్యం దరఖాస్తులు వేసే వారిని అడ్డుకోవద్దని నాయకులను హెచ్చరించింది. దీంతో నాయకులను కాదని సొంతంగా దరఖాస్తు వేసేవారు ముందుకొచ్చారు. దీనికి తోడు ఈసారి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో కూడా వేసే అవకాశం ఉండటంతో స్థానికులు కాని వారు కూడా మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. దీంతో దరఖాస్తుల సంఖ్య పెరిగిపోయింది. దీంతో నాయకుల అంచనాలు తలకిందులయ్యాయి. దరఖాస్తు వేసిన వారు ఎక్కడి వారనే విషయం తెలియకుండా పోవటంతో దుకాణాలను దక్కించుకోవటంలో పోటీ పెరిగిపోయింది. దుకాణాలు తమని దాటి బయటకు పోవన్న పరిస్థితి తిరగబడింది.

మిగతా 6లో..

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా పయ్యావుల కేశవ్

- అన్నమయ్య జిల్లాకు బీసీ, నెల్లూరుకు ఫరూక్



నంద్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆయా జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును పరిశీలించేందుకు రాష్ట్ర పభుత్వం ఇన్‌చార్జి మంత్రులను మంగళవారం నియమించింది. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నియమితులయ్యారు. ఇక నుంచి జిల్లాలో జరిగే అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను ఆయన పర్యవేక్షిస్తారు. అదే విధంగా జిల్లాకు చెందిన రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నమయ్య జిల్లాకు కేటాయించగా న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా నియమితులయ్యారు.

నేడు శ్రీశైల జలాశయం క్రస్టు గేట్ల ఎత్తివేత

- ఇన్‌ఫ్లో 1,44,868 క్యూసెక్కులు
- కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

శ్రీశైలం, అక్టోబరు 15: శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు బుధవారం నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. జూరాల నుంచి 59,683 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 63,630 క్యూసెక్కులు మొత్తం 1,23,314 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. మంగళవారం సాయంత్రం 6 గంటల సమాయానికి జలాశయానికి 1,44,868 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 883.90 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీంఎసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 209.1579 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,752 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కులు మొత్తం 66,067 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.



శ్రీశైలం డ్యాం

ఆహా.. ఏమి గుహలు..!
- భూలోక కైలాసాన్ని తలపిస్తున్న అందాలు 6
- తిలకించేందుకు తరలి వస్తున్న పర్యాటకులు

నొప్పి తెలియదు..!
- ఏటా 80వేల మందికి మత్తు మందు 6
- నేడు వరల్డ్ అనస్థీషియా డే

దేశ భవిష్యత్తుకు నారీశక్తి అవసరం
- బాలికల్లో దాగి ఉన్న శక్తిని
- వెలికి తీయండి : కలెక్టర్ రాజకుమారి 7

ఎన్టీఆర్ శిలా ఫలకాన్ని ఎలా తొలగిస్తారు?

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మండిపాటు

నంద్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన దివంగత ఎన్టీఆర్ శిలా ఫలకాన్ని ఎలా తీసేస్తారంటూ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మండిపడింది. శిలా ఫలకాన్ని తీసేసిన విషయం తెలుసుకున్న ఆమె మంగళవారం విజయా డెయిరీకి వచ్చారు. పక్కన పడి ఉన్న శిలా ఫలకాన్ని తీసి పాలతో కడిగారు. ఆ తర్వాత ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లలో విజయ డెయిరీ యాజమాన్యం ఇష్టారీతిన వ్యవహరించిందని అన్నారు. ప్రభుత్వం మారినా ఇంకా జగనే సీఎం అనే భ్రమలో ఉందని విమర్శించారు. జగన్ ఫొటో డైరీలో ఉంచారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అసలు ఎన్టీఆర్ శిలా ఫలకాన్ని తీసేయాల్సిన అవసరమే ఏం వచ్చిందని, ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యే సరికి ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని చెబుతున్నారని తెలిపారు. ఈ విషయం మాట్లాడటానికి వస్తే తన కుర్చీలో ఎందుకు కూర్చున్నావని చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతున్నారని, ఇదేం తీరని ఆమె అన్నారు. ఇదే విషయంపై విజయ డెయిరీ చైర్మన్‌తో ఆంధ్రజ్యోతి మాట్లాడగా డెయిరీలోని ఓ విభాగాన్ని పునఃప్రారంభించేందుకు పనులు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా ఎన్టీఆర్ శిలాఫలకాన్ని పక్కన పెట్టామని, దీనిని రాద్ధాంతం చేయాల్సిన అవసరం లేదని అన్నారు. తాము కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, ప్లాంటు ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా మంత్రులైన ఎన్ఎండీ ఫరూఖ్, బీసీ జనార్దన్‌రెడ్డిని, మిగతా నాయకులను కూడా ఆహ్వానించామని చెప్పారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

మూడు గంటలు ముచ్చెమటలు

- గడిగరేవులలో ట్రాఫిక్ జామ్
- సుమారు 4 కి.మీ. మేర నిలిచిన వాహనాలు
- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు



రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

గడివేముల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకుల నిర్లక్ష్యం.. అధికారుల ప్రణాళిక లోపం వల్ల మండలంలోని గడిగరేవులలో మంగళవారం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. గడిగరేవుల నుంచి చిందుకూరు వరకు, గడిగరేవుల నుంచి తిరుపాడు వరకు రహదారిపై కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ముందుకు వెళ్లలేక వెనక్కు రాలేక మధ్యలో చిక్కుకొని ప్రయాణికులు గంటల తరబడి తీవ్ర అవస్థలు పడ్డారు. గడిగరేవుల గ్రామంలో జరిగిన గంగమ్మ, సుంకులమ్మ జాతరకు భారీగా భక్తులు తరలి వచ్చారు. వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించకపోవడంతో భక్తులు రోడ్డుకు ఇరువైపుల వాహనాలను పార్కింగ్ చేశారు. భక్తుల తాకిడి, నందికొట్కూరు, నంద్యాలకు వెళ్లే వాహనాల రాకపోకల వల్ల రోడ్డుపై మధ్యాహ్నం 12 గంటల నుంచి ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ జామ్‌ను నియంత్రించడంలో పోలీసులు విఫలమవడంతో సుమారు మూడు గంటల పాటు ఇబ్బందులు పడ్డామని ప్రయాణికులు వాపోయారు. పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి ట్రాఫిక్ జామ్ క్లియర్ చేయడంతో సాయంత్రం 4 గంటలకు వాహనాల రాకపోకలు సాఫీగా సాగాయి.

రాఘవేంద్రుని సన్నిధిలో హైదరాబాద్ సిటీ సివిల్ న్యాయాధికారి

మంత్రాలయం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం హైదరాబాదు సిటీ సివిల్ న్యాయాధికారి వినోద్ మంగళవారం సాయంత్రం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్, బిందుమాధవ్, అనంత స్వామి, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం

ఆహా.. ఏమి గుహాలు..!



ప్యాపిలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి గుహలు నంద్యాల జిల్లాకే తలమానికంగా నిలుస్తున్నాయి. గుహల్లో ప్రకృతి సిద్ధంగా వెలసిన ఆకృతులు, రమణీయమైన అందాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. సహజ సిద్ధంగా ఏర్పడిన శివలింగం, నందీశ్వరుడు తదితర దృశ్యాలు పర్యాటకులను అబ్బుర పరుస్తున్నాయి. ప్యాపిలి మండలంలోని బోయవాండ్లపల్లి గ్రామం సమీపంలో కొండ ప్రాంతంలో వాల్మీకి గుహలు వెలిశాయి.

ఈ గుహలు రెండు దశాబ్దాల క్రితం వెలుగు చూశాయి. భూ మట్టానికి దాదాపు 500 అడుగుల లోతులో వెలసిన ఈ గుహల్లో ఎన్నో అద్భుత దృశ్యాలు దర్శనమిస్తాయి. 2004లో ఈ ప్రాంతంలో పని చేసిన కొందరు ఉపాధ్యాయులు గుహలను వెలుగులోకి తేవడంతో ప్రాచుర్యంలోకి వచ్చాయి. గతంలో స్థానికులు దివిటీల ద్వారా తాళ్ల సాయంతో పర్యాటకులను గుహల లోపలికి తీసుకెళ్లేవారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రూ.కోట్లు వెచ్చించి ప్రభుత్వం గుహలను అభివృద్ధి చేయడంతో గుహల్లోకి వెళ్లే మార్గం సులువుగా ఉంది. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది.

- భూలోక కైలాసాన్ని తలపిస్తున్న అందాలు
- స్వయంభువుగా వెలసిన శివలింగం, నందీశ్వరుడు
- ఆకర్షణీయంగా శిలా తోరణాలు, రుద్రాక్ష ఆకృతులు
- తిలకించేందుకు తరలి వస్తున్న పర్యాటకులు



గుహ లోపల స్వయంభువుగా వెలసిన శివలింగం



గుహలోని మెట్ల మార్గం ద్వారా బయటికి వస్తున్న పర్యాటకులు

అబ్బురపరుస్తున్న దృశ్యాలు

వాల్మీకి గుహల్లో అద్భుతమైన దృశ్యాలు అబ్బుర పరుస్తున్నాయి. స్వయంభువుగా వెలసిన శివలింగం, నందీశ్వరుడు, ధ్వజ స్తంభం వంటి దృశ్యాలు పర్యాటకులను భక్తి పారవశ్యంలోకి తీసుకెళ్లతాయి. అలాగే 500 అడుగుల లోపల విశాలమైన మైదానం, అక్కడే గలగల పారే సెలయేరు వంటి అద్భుతాలు కైలాసాన్ని తలపిస్తున్నాయి. అదేవిధంగా గుహల్లోకి వెళ్లే మార్గంలో వివిధ ఆకృతులు, శిలా తోరణాలు, రుద్రాక్ష రూపాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.



గుహల ప్రవేశ ద్వారం

పర్యాటక కేంద్రంగా వాల్మీకి గుహలు



వాల్మీకి గుహలు పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్నాయి. గతంలో గుహలోకి వెళ్లాలంటే స్థానికుల సాయంతో వెళ్లాల్సి ఉంది. దివిటీలు, టార్చి లైట్ల ద్వారా పర్యాటకులను తాళ్ల సాయంతో తీసుకెళ్లేవారు. అయితే ప్రస్తుతం గుహలను రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశారు. విద్యుత్ సౌకర్యం, మెట్లు ఏర్పాటు చేశారు. ఇప్పుడు గుహల్లోకి వెళ్లడానికి అనుకూలంగా ఉండటంతో పర్యాటకుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో గుహల దగ్గర హోటల్ కూడా ఏర్పాటు చేశారు.

మాకు వాటా ఇవ్వాల్సిందే..!

5 పేజీ తరువాయి

ఐదేళ్లు అధికారానికి దూరంగా ఉన్న వారికి కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీ కొత్త ఆశలను రేపింది. వచ్చీ రాగానే ఆదాయాన్ని తెచ్చిపెట్టే మార్గంగా మద్యం విధానం కనిపించింది. జిల్లాలోని ఆయా మద్యం సర్కిళ్లలో అధికార పార్టీ నాయకులు సిండికేట్‌గా మారి మద్యం దుకాణాలకు దరఖాస్తులు సమర్పించారు. లాటరీ ప్రక్రియలో సిండికేట్లకు పెద్ద దెబ్బ పడింది. సిండికేట్ వ్యాపారులు భారీగా దరఖాస్తులు సమర్పించినా కొన్ని దుకాణాలను మాత్రమే దక్కించుకోగలిగారు. దీంతో మద్యం వ్యాపారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. 'మా నియోజకవర్గ నాయకులు దరఖాస్తులు వేయవద్దని బెదిరించారు. వారిని కాదని దరఖాస్తులు వేయలేదు. ఇపుడు మా నియోజకవర్గంలోని ఏడు దుకాణాలు అసలు ముక్కూ మొఖం తెలియని వారు ఎగరేసుకుపోయారు. అదే తాము దరఖాస్తులు వేసి ఉంటే అదృష్టం తమని వరించేదేమో' అని ఓ వ్యాపారి సోమవారం లాటరీ తీసే సమయంలో ఆక్రోశం వెల్లగక్కాడు. దీనిని బట్టి కొంతమంది నాయకులు మద్యం దుకాణాల విషయంలో ఎలా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చు. దుకాణాలను దక్కించుకోవటంలో నాయకులు విఫలమైనా, తర్వాతి తతంగానికి తెరతీశారు. తమ సిండికేట్లలో భాగం కాకుండా దుకాణాలను దక్కించుకున్న వారికి నాయకులు తమ వద్దకు పిలిపించుకుని మాట్లాడారు. సిండికేట్లలో భాగమైన వారైనా, కాని వారైనా తమకు నెలకు 30 శాతం వాటా ఇచ్చి దుకాణాలను నడిపించుకోవాలని గట్టిగా చెప్పారు. మరోవైపు వైసీపీ నాయకులు కూడా సిండికేట్‌గా మారి దరఖాస్తులు వేసిన వారు ఆయ సర్కిళ్ల పరిధిలో ఓ మోస్తరుగా దుకాణాలను దక్కించుకున్నారు. వీరిని వాటా అడగే పరిస్థితి కూటమి నాయకులకు లేదు. దీంతో ఆయా నియోజకవర్గ నాయకులు తమ ప్రతాపాన్ని తమని కాదని దుకాణాలను దక్కించుకున్న వారిపైనే చూపుతున్నారు. దీంతో దుకాణాలను దక్కించుకున్నవారు ఏం చేయాలో పాలుపోని స్థితిలో పడిపోయారు.

అద్దెకు చుక్కలు..

నూతన మద్యం పాలసీ విధానంలో దుకాణాలకు దక్కించుకున్న వారికి కొత్త సమస్య వచ్చి పడింది. సిండికేట్లలో భాగం అయిన వారికైతే వారికి సంబంధించిన దుకాణాలు ఉండేవి. కానీ కొత్తగా మద్యం దుకాణాలకు దక్కించుకున్న వారికి దుకాణాలు అద్దెకు తీసుకోవటంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా రూ.10 వేలు ఉండే దుకాణాలు మద్యం వ్యాపారానికి అనగానే సంబంధిత యజమానులు అద్దెను అమాంతం పెంచేశారు. నంద్యాల పట్టణంలో మద్యం దుకాణం అద్దె రూ.80 వేలు చెబుతున్నారు. ఇక మిగతా చోట్ల కూడా పరిస్థితి ఇంచుమించు ఇలాగే ఉంది. ఇక్కడి వారి పరిస్థితే ఇలా ఉందంటే.. పక్క రాష్ట్రమైన తెలంగాణ నుంచి దుకాణాలను దక్కించుకున్న వారి పరిస్థితి మరోలా ఉంది. ఈ ప్రాంతానికి వారు పూర్తిగా కొత్త కావటంతో స్థానిక నాయకులకు తెలియకుండా వ్యాపారం చేసే పరిస్థితి లేదు. దీనికి తోడు ఎక్కడి వారో ఇక్కడకు వచ్చి తమ వాటా పరిస్థితి ఏమిటో చెప్పకుండా వ్యాపారం చేస్తామంటే కుదరదని, వారికి దుకాణాలను అద్దెకు ఇవ్వకూడదని కొంతమంది నాయకులు ఆదేశాలు జారీ చేశారు. విపరీతంగా చెబుతున్న అద్దెలకు తోడు, అసలు దుకాణాలు దొరకని పిరిస్థితిని ఎదుర్కొంటున్న దుకాణాలను దక్కించుకున్న వారు తీవ్ర అయోమయంలో పడిపోయారు. తాత్కాలికంగా ఎక్కడో ఓ చోట దుకాణాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారం మొదలుపెట్టినా, వారం తర్వాత ప్రభుత్వానికి అద్దెకు సంబంధించిన అగ్రిమెంటు కాపీ అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో స్థానిక నాయకులు చెప్పినట్లు వాటా ఇవ్వకుండా తప్పించుకునే పరిస్థితి కనిపించటం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.





వారి బాధ వర్ణనాతీతం..

ఎప్పటి నుంచో మద్యం వ్యాపారంలో ఉన్నాం.. ఎక్కువ దరఖాస్తులు వేస్తే ఓ రెండు మూడైనా దక్కకపోతాయా? అనే అభిప్రాయంతో కొంతమంది సిండికేట్‌గా మారి దరఖాస్తులు వేశారు. వీరి ఆశలు అడియాసలయ్యే సరికి నిరాశలో కూరుకుపోయారు. ఇలాంటి వారిలో ఎక్కువగా కూటమికి చెందిన వారే ఉండటం గమనార్హం. తాము ఎప్పటి నుంచో పార్టీ కోసం పని చేస్తున్నామని, కూటమి అధికారంలోనికి రావటానికి ఇబ్బందులు కూడా ఎదుర్కొన్నామని, ఇపుడు మద్యం వ్యాపారంలో ప్రభుత్వం తమకు సహకరిస్తుందని భావిస్తే పరిస్థితి మరో విధంగా ఉందని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం దరఖాస్తుల కోసం పెట్టిన ఖర్చంతా సీఎం సహాయ నిధికి ఇచ్చినట్లు భావిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఇక సిండికేట్లలో దుకాణాలను దక్కించుకున్న వారి పరిస్థితి మరోలా ఉంది. లెక్కకు మించి సిండికేట్లలో సభ్యులుగా ఉన్న వారికి దక్కింది నామమాత్రపు దుకాణాలే. మంది ఎక్కువైతే మజ్జిగ పల్చన అన్న చందంగా మద్యం అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయం పంచుకుంటే మిగిలేది పెద్దగా ఏమీ ఉండదు. పోని మద్యాన్ని ఎక్కువ రేటుకు అమ్ముకుందామని భావించినా కూటమి ప్రభుత్వం ఒప్పుకోదు. కాబట్టి దుకాణాలను దక్కించుకున్న సిండికేట్ల సభ్యులు కూడా నిరాశలో ఉన్నారు. పైగా ఏం చేసినా, ఎంత అమ్ముకున్నా నాయకులకు చెప్పిన మొత్తంలో కమీషన్లు అప్పగించాల్సిందే! వెరసి నూతన మద్యం విధానం దుకాణాదారులకు చుక్కలు చూపిస్తుంటే.. నాయకులు మాత్రం తమ జేబులు నింపుకునే పనిలో పడ్డారు.

నొప్పి తెలియదు...

- ఏటా 80వేల మందికి మత్తు మందు
- నేడు వరల్డ్ అనస్థీషియా డే

వైద్యశాస్త్రంలో శస్త్ర చికిత్సలో మత్తు మందు పాత్ర ఎంతో కీలకమైంది. రోగికి నొప్పి, బాధ తెలియకుండా గమ్మత్తుగా మత్తు మందు ఇచ్చి ఆపరేషన్ చేయడం వైద్యశాస్త్రంలో ఓ అద్భుతం. 1837 ప్రాంతంలో ఆపరేషన్ అంటే భరించరాని నొప్పితో అత్యంత క్రూరంగా ఉండేది. ఆ కాలంలో శస్త్రచికిత్స చేయించుకునే రోగికి చాలా నొప్పి ఉండేది. వైద్యులు, నర్సులులే కాకుండా మరో పది మంది రోగిని గట్టిగా పట్టుకుని ఆపరేషన్ చేసేవారు. 1846 అక్టోబరు 16న అమెరికాలోని మసాచుసెట్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు దంత వైద్యుడు జాన్‌కోవిన్స్‌తో కలిసి గిల్బర్ట్ అంబార్టు గొంతుకు శస్త్ర చికిత్స చేసేందుకు తొలిసారిగా ఈథర్ మందు ఇచ్చి ఆపరేసన్ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం అక్టోబరు 16న ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో 1958లో అనస్థీషియా విభాగాన్ని ప్రారంభించారు. అప్పుడు ఓ ప్రొఫెసర్ ఓ అసోసియేట్ ప్రొఫెసర్ ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లుతో విభాగాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఆ విభాగంలో డాక్టర్ విశాల హెచ్‌వోడీ ముగ్గురు ప్రొఫెసర్లు, 4 మంది అసోసియేట్, 18 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు 39 మంది పీజీలు పని చేస్తున్నారు. ప్రతి ఏడాది 30వేల మందికి ఆపరేషన్ సమయంలో మత్తుమందు ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 148 మంది మత్తు మందు వైద్యులు పని చేస్తుండగా.. ఏటా 80 వేల ఆపరేషన్లకు అనస్థీషియా మందును డాక్టర్లు ఇస్తున్నారు. ఆపరేషన్లతో పాటు అన్నిరకాల స్పెషాలిటీసీలకు సంబంధించిన ఆపరేషన్లతో పాటు రేడియాలజీ, న్యూరాలజీ విభాగంలో పెయిన్ క్లీనిక్ ఇంజెక్షన్లు ఇస్తున్నారు. కార్డియోథోరాసిక్ విభాగంలో 500 మంది గుండె ఆపరేషన్ల కేసులకు విశిష్ట సేవలు అందిస్తున్నారు.

మహిళలదే పైచేయి: అనస్థీషియా వైద్యుల్లో పురుషుల కంటే అమ్మాయిలే ఎక్కువగా ఈ వృత్తి పట్ల మొగ్గు చూపుతున్నారు. గతంలో పురుషులే అనస్థీషియా వైద్యులుగా కొనసాగేవారు. ప్రస్తుతం 100కి 70 శాతం అమ్మాయిలే వైద్యులుగా చేరుతున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 18 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లతో 14 మంది మహిళలే అనస్థీషియా వైద్యురాలు పని చేస్తున్నారు. ఇక 39 పీజీ వైద్యవిద్యార్థుల్లో 30 మంది మహిళలే కొనసాగుతున్నారు. ఇక ఈ విభాగానికి హెచ్‌వోడీగా డాక్టర్ విశాల కొనసాగుతున్నారు.

నేడు అనస్థీషియా దినోత్సవ వేడుకలు



కర్నూలు సొసైటీ ఆఫ్ అనస్థీషియా ఆధ్వర్యంలో వరల్డ్ అనస్థీషియా డే వేడుకలను కర్నూలు జీజీహెచ్‌లో నిర్వహిస్తున్నాం. అనంతరం ఆపరేషన్ సమయంలో మత్తు మందు వైద్యుల పాత్రపై అవగాహన కల్పించనున్నాం. జిల్లా వ్యాప్తంగా కర్నూలు జీజీహెచ్, నంద్యాల జీజీహెచ్, ఆదోని, ఎమ్మిగనూరు, బనగానపల్లె, డోన్, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, శ్రీశైలం, పత్తికొండ వంటి ప్రాంతాల్లో ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏడాదికి 80వేల ఆపరేషన్లలో మత్తు వైద్యులు పాల్పంచుకుంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా వైద్యంలో అనస్థీషియా ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి వరల్డ్ అనస్థీషియా డేను నిర్వహిస్తున్నారు.

– డా.జే. సుధీర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, కర్నూలు సొసైటీ ఆఫ్ అనస్తీషియాలజిస్టు

అనస్థీషియా వైద్యుల పాత్ర కీలకం



రోగికి ఆపరేషన్ చేసే సమయంలో అనస్థీషియా వైద్యుల పాత్ర ఎంతో కీలకమైంది. ప్రస్తుతం అల్ట్రాసౌండ్, ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌లతో చూసి కొత్త పద్ధతిలో నొప్పి తెలియకుండా మత్తుమందు ఇస్తున్నాం. ప్రస్తుతం అనస్థీషియా వైద్యులు లేకుండా ఆపరేషన్లు జరగడం లేదు. కీళ్ల శస్త్ర చికిత్సలకు, ప్రసవ వేదనను తగ్గించడానికి మత్తు మందును కూడా ఇస్తున్నాం. ఆసుపత్రిలో గైనిక్, న్యూరోసర్జరీ, కార్డియోథోరాసిక్, సర్జరీ విభాగాల రోగులకు మత్తుమందు ఇవ్వగలుగుతున్నారు.

– డా. రామశివనాయక్, స్టేట్ ఈసీ సభ్యుడు, ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థీషియా, కర్నూలు జీజీహెచ్

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం



సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి ఫరూక్

గోస్పాడు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం అని, కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో సంక్షేమం, అభివృద్ధి పరుగులు తీస్తోందని న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. పల్లె పండుగలో భాగంగా మంగళవారం నాగులవరం, పసురపాడు గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని రాష్ట్రం అన్ని రంగాలలో వెనుకకు వెళ్లిందన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. నంద్యాల నియోజకవర్గంలోనే రెండు మండలాలలోని గ్రామాలకు దాదాపు రూ.ఏడు కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. పని చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, వీరసింహారెడ్డి, జూపల్లె రామగోపాల్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ఈదరమేష్, సుధాకర్, నరేంద్రరెడ్డి, మహానందరెడ్డి పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులందరూ పాస్ కావాలి


కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి)15: జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని దామోదరం సంజీవయ్య స్మారక మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించి విద్యార్థులతో సంభాషించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై బోధన, పిల్లల సామర్థ్యం ఉత్తీర్ణత తదితర అంశాల గురించి కలెక్టర్ చర్చించారు. కలెక్టర్ ముందుగా పాఠశాల ఆవరణలోని బాలబాలికలతో సంభాషిస్తూ మెనూ ప్రకారం మీకు భోజనం అందజేస్తున్నారా..? అని ఆరా తీశారు. ప్రాథమిక పాఠశాల స్థాయి నుండే విద్యార్థులు చదవడం, రాయడం వంటి కనీస నైపుణ్యాలు సాధించేలా బోధనా పద్ధతులు ఉండాలని ఉపాధ్యాయులు అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, డీఈవో శామ్యూల్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మి ఉపాధ్యాయులు ఉన్నారు.

శ్రీశైలం దేవస్థానం ఏఈవో సస్పెన్షన్

శ్రీశైలం, అక్టోబరు 15: శ్రీశైలం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఏఈవో ఫణిధర్ ప్రసాద్ సస్పెండ్ అయ్యారు. గతంలో రెవెన్యూ విభాగంలో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఆయనపై హిందూ జనశక్తి వెల్‌ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని దేవదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ ఆర్‌జేసి చంద్రశేఖర్ ఆజాద్‌ను ఆదేశించారు. దీనిపై ఆర్‌జేసి విచారణ చేపట్టి నివేదికలను కమిషనర్‌కు సమర్పించారు. నివేదికల ఆధారంగా దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఏఈవో ఫణిధర్ ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఆలయ ఈవో డి.పెద్దిరాజు ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్‌యూ రిజిస్ట్రార్‌గా విజయకుమార్‌నాయుడు



కర్నూలు, అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా బోయ విజయకుమార్ నాయుడు నియమితులయ్యారు. యోగి వేమన యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆయనను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో పని చేసిన రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు పరీక్షల విభాగానికి వెళ్లారు. గతంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల తీరుతో మనస్తాపానికి గురైన ఆయన రిజిస్ట్రార్ పదవికి రాజీనామా చేయడంతో ఖాళీగా ఉన్న పోస్టులో విజయ్‌కుమార్‌నాయుడును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు

99 తాత్కాలిక లైసెన్సులు జారీ



కర్నూలు అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా నాణ్యమైన మద్యం కోసం ఎదురు చూస్తున్న మందుబాబులకు బుధవారంతో తెరపడనుంది. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆ దిశగా చర్యలు చేపట్టింది. అక్టోబరు 1న నూతన మద్యం పాలసీ గజిట్‌ను విడుదల చేసిన ప్రభుత్వం లాటరీ ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు మద్యం దుకాణాలను కేటాయించే ప్రక్రియ సోమవారంతో ముగిసింది. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ 99 మద్యం దుకాణాలకు రెండేళ్ల కాలపరిమితితో లైసెన్సులు జారీ చేయనుంది. ఈ క్రమంలో మంగళవారం జిల్లాలో ఏడు ఎక్సైజ్ స్టేషన్లలో లాటరీ పద్ధతిలో ఎంపికైన లబ్ధిదారులు తాత్కాలిక లైసెన్సులు జారీ చేసింది. జిల్లాలో 99 దుకాణాలకు 3046 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దుకాణానికి రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వానికి రూ.60.26 కోట్ల ఆదాయం సమకూరింది.

ప్రభుత్వ మద్యం దుకాణాలకు మంగళవారంతో ముగిసింది. మంగళవారం నాటికి విక్రయం కాగా మిగిలిన స్టాక్ మొత్తాన్ని ఐఎంఎల్ డిపోలకు అందజేయాలని ఇప్పటికే ప్రభుత్వ మద్యం దుకాణాలకు సమాచారమిచ్చారు. 16 నుంచి నూతన మద్యం విధానం అమల్లోకి వస్తుందని సూపరింటెండెంట్ మచ్చా సుధీర్ బాబు తెలిపారు.

వెంటనే ఫీజులు కట్టేలా..

లాటరీలో ఎంపికైన లైసెన్సీలతో వెంటనే ఫీజులు కట్టించేలా బ్యాంకర్లను అందుబాటులో ఉంచింది. దుకాణాలు దక్కించుకున్న వారు సోమవారం రాత్రి నిర్దేశిత లైసెన్సు ఫీజు 6వ వంతు చెల్లించటంతో వారి పేరుతో తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేశారు. రాష్ట్రంలో ఉన్న 26 జిల్లాల్లో లైసెన్సు ఫీజు పూర్తిగా చెల్లించి జిల్లాలో రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉందని డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి తెలిపారు. బుధవారం ఉదయానికి ఆ షాపులకు మద్యం నిల్వలు సరఫరా చేయాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మద్యం ఐఎంఎల్ డిపో అధికారులతో సమావేశమై ఆదేశాలు జారీ చేశారు.

తక్కువ ధరకు మద్యం దక్కాలంటే..

నూతన మద్యం పాలసీ అమలులో ప్రభుత్వ పేర్కొన్నట్లుగా రూ. 99 కే క్వార్టర్ బాటిల్ మద్యం అందజేస్తామని మందుబాబులకు పేర్కొన్నప్పటికీ ఆచరణలో కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు అంటున్నారు. పాలసీ అమలులో ధరల సవరణకు సంబంధించి క్యాబినెట్ ఆమోదం పొందాల్సి ఉంటుందని, కొన్ని మద్యం కంపెనీలు రూ. 99 కే క్వార్టర్ అందించేందుకు ఒప్పుకున్నాయని, మరి కొన్ని కంపెనీలు కూడా ఆమోదం తెలపాల్సి ఉందని, ఆ మేరకు ప్రభుత్వం చర్యలు వెంటనే తక్కువ ధరకు మద్యంను అందిస్తామని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. నూతన మద్యం పాలసీ ప్రక్రియలో జిల్లాలో 99 దుకాణాలు ప్రారంభం కానున్నాయి.

అద్దె అవస్థలు..!

- బాడుగకు దొరకని దుకాణాలు
- మద్యం షాపులు తగిలినా.. అద్దెకు షాపులు లేక ఇబ్బందులు
- పలు మండలాల్లో రాజకీయ నాయకుల బెదిరింపులు

కర్నూలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): లాటరీలో మద్యం దుకాణం వచ్చిందని సంతోషించాలో.. షాపులు అద్దెకు దొరకపోవడంతో బాధపడాలో తెలియని పరిస్థితి మద్యం లీజుదారులది. మంగళవారం రాత్రి 8 గంటలకు ప్రభుత్వ మద్యం దుకాణాలకు తాళం పడింది. బుధవారం ఉదయం 10 గంటలకు ప్రైవేటు మద్యం దుకాణాలు తలుపులు తెరుచుకోవాల్సి ఉంది. డిప్ ద్వారా దుకాణాలు కేటాయించిన వ్యాపారులకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు తాత్కాలిక లైసెన్సులు జారీ చేశారు. అదే క్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ (ఏపీఎస్‌బీసీ) గోడౌన్ల నుంచి మద్యం సరఫరాకు అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. అయితే.. జిల్లాలో లీజుదారులకు మద్యం షాపులు ఏర్పాటు కోసం ప్రైవేటు దుకాణాలు అద్దెకు దొరకడం కష్టంగా మారింది. దీంతో మంగళవారం అర్ధరాత్రి వరకు కేవలం 25 షాపులకు చెందిన లీజుదారులు మాత్రమే మద్యం తీసుకెళ్లారు. ఉదయం 10 గంటలకు మద్యం షాపులు తెరుచుకుంటాయి. దీంతో ఆరు గంటల నుంచి మద్యం సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే క్రమంలో పలు నియోజకవర్గాల్లో మద్యం షాపు తగలిన వారికి ఫోన్లు చేసి రాజకీయ నాయకులు బెదిరింపులకు గురి చేస్తున్నట్లు సమాచారం.

జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, కోసిగి, ఆదోని, పత్తికొండ, ఆలూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 99 మద్యం దుకాణాల లీజుదారులకు ఎక్సైజ్ అధికారులు తాత్కాలిక లైసెన్సులు ఇచ్చారు. మంగళవారం రాత్రి ప్రభుత్వం మద్యం దుకాణాలకు తాళం పడడంతో.. నేటి నుంచి ప్రైవేటు షాపులు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. మెజార్టీ లీజుదారులకే అద్దె భవనాలు దొరకకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలు, గ్రామాల్లో అద్దె భవనాలు కోసం గాలిస్తున్నారు. అదే క్రమంలో షాపులు తగలని రాజకీయ నాయకులు కూడా భవనాలు అద్దెకు ఇవ్వకుండా రాజకీయంగా అడ్డుకుంటున్నట్లు సమాచారం.

● షాపు నడుపుకోగలవా..?

అధికార టీడీపీ కూటమి, ప్రతిపక్ష వైసీపీ నాయకుల అండతో దరఖాస్తు చేసి.. షాపు తగలినవారికి ఎలాంటి ఇబ్బందులు లేవు. ఎలాంటి రాజకీయ అండ లేకుండా మద్యం వ్యాపారంపై మమకారంతో దరఖాస్తులు చేసి.. షాపుల తగిలిన వారికి రాజకీయ నాయకుల నుంచి అప్పుడే బెదిరింపులు మొదలయ్యాయి. జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న నియోజకవర్గంలో అన్నీతానై రాజకీయాలు చేస్తున్న ఓ ముఖ్యనాయకుడు షాపు పెట్టి మద్యం అమ్ముకోగలవా..? అంటూ బెదిరింపులకు దిగినట్లు విశ్వసనీయ సమాచారం. మరో నియోజకవర్గంలో ఓ ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు కూడా ఇదే పంథాలో ఉన్నట్లు తెలుస్తుంది. కొత్తగా మద్యం వ్యాపారంలోకి అడుగు పెట్టి ఓ మాజీ డ్రైవర్‌కు మద్యం షాపు తగిలితే.. లైసెన్సు మాకు ఇవ్వు.. లేదంటే మద్యం షాపు ఎలా నడుపుకుంటావు అంటూ భయపెడుతున్నట్లు సమాచారం. అదే కాదు.. ఎక్సైజ్ సీఐ ఒకరు రంగలోకి ఏకంగా లీజుదారులకు ఫోన్లు చేసి ఎమ్మెల్యేతో మాట్లాడుకున్నావా..? షాపు పెడితే ఆ తరువాత ఇబ్బందులు వస్తాయేమో..? అంటూ సలహా లాంటి బెదిరింపులకు పాల్పడటం చర్చనీయాంశమైంది. తెలంగాణ వ్యక్తికి మద్యం షాపు తగిలితే ఆయనకు ఫోన్ ఇలాంటి సలహా ఇచ్చారని తెలుస్తుంది. అనంతపురం జిల్లాకు పక్కనే ఉన్న నియోజకవర్గంలో కూడా ఎమ్మెల్యే పేరుతో ఆయన సన్నిహితులు బెదిరిస్తున్నట్లు తెలుస్తుంది. అదే క్రమంలో లీజుదారులు అద్దె భవనాల కోసం వెళితే.. ఇవ్వవద్దంటూ యజమానులకు వర్తమానం పంపుతున్నట్లు తెలుస్తోంది.

సమన్వయంతో పని చేద్దాం

● ఏపీ సీడ్స్ చైర్మన్ సుబ్బారెడ్డిని కలిసిన తెలంగాణ సీడ్స్ చైర్మన్



సుబ్బారెడ్డికి బొకే అందజేస్తున్న తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి

డోన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇరు తెలుగు రాష్ట్రాల్లో రైతులకు మేలు జరిగేలా పని చేద్దామని ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం అమరావతిలోని ఏపీ సీడ్స్ కార్పొరేషన్ కార్యాలయంలో చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డిని తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్. అన్వేష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరు రాష్ట్రాల్లో సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ లిమిటెడ్‌ల పలు అంశాలపై చర్చించారు. రైతులకు అందించే విత్తనాల పంపిణీ సరఫరాలో పరస్పరం సహకారం అందించుకునేలా చర్చించినట్లు సుబ్బారెడ్డి తెలిపారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించేందుకు కృషి చేస్తామన్నారు. రెండు రాష్ట్రాల్లోని సీడ్స్ కార్పొరేషన్లు కలిసి పని చేసి రైతులకు మేలు జరిగే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

హౌసింగ్ ఇన్‌చార్జి పీడీగా విశ్వనాథ్



కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ ఇన్‌చార్జి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా సి.విశ్వనాథ్ నియమితులయ్యారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-3 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న విశ్వనాథ్ పీడీగాను అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. త్వరలోనే మాతృ సంస్థ అయిన రెవెన్యూ శాఖలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు జరగనున్న నేపథ్యంలో కొద్ది రోజుల పాటే ఈయన ఈ పదవిలో కొనసాగనున్నట్లు సమాచారం. గతంలో ఇక్కడ పీడీగా పనిచేసిన సిద్ధలింగమూర్తి గుంటూరు జిల్లా డ్వామా పీడీగా బదిలీ అయిన విషయం విదితమే.

సద్దుమణిగిన సమస్య

- ఆరేకల్లు విద్యార్థులకు యథావిధిగా మధ్యాహ్న భోజనం

ఆదోని రూరల్, అక్టోబరు, 15(ఆంధ్రజ్యోతి): ఆదోని కూటమి నాయకుల కొమ్ములాట కారణంగా అటు నాయకులు, ఇటు కార్యకర్తలు పంతానికి వెళ్లి ఆదోని మండలం ఆరేకల్లు జడ్పీహెచ్ఎస్ లో సోమవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టకపోవడంతో విద్యార్థులు పస్తులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో మంగళవారం 'పొత్తులో పోట్లాట' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా అధికారులు, కూటమి పెద్దలు దిగి వచ్చి మధ్యాహ్న భోజన పంచాయితీని పరిష్కరించారు. దీంతో యథావిధిగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వండి పెట్టారు. ఎంఈవో రాజేంద్ర ప్రసాద్, సీఆర్పీ మల్లికార్జున పాఠశాలను తనిఖీ చేసి హెచ్ఎం సుబ్రహ్మణ్యంను విచారించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటామని ఎంఈవో తెలిపారు.

దేశ భవిష్యత్తుకు నారీశక్తి అవసరం

● బాలికల్లో దాగి ఉన్న శక్తిని వెలికి తీయండి : కలెక్టర్ రాజకుమారి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్

నంద్యాల కల్చరల్, అక్టోబరు 15 ఆంధ్రజ్యోతి : దేశభవిష్యత్తు కోసం నారీశక్తి అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశలో పయనించేందుకు అవకాశాలను అందిపుచ్చుకొని దృఢ సంకల్పంతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ రాజకుమారి విద్యార్థినులకు ఉద్బోధించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సెంటనరీ హాల్లో అంతర్జాతీయ బాలికల దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ రాజకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థినులలో సృజనాత్మక ఆలోచనలు రేకెత్తిస్తే ఏదైనా సాధించగలరని అన్నారు. తల్లిదండ్రులు భవిష్యత్తులో అమ్మాయిలే కావాలన్న దృక్పథానికి వచ్చే పరిస్థితులు ఉన్నాయన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పదర్శించిన విద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

కోసిగి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అగసనూరు గ్రామానికి చెందిన చిన్నమూతి హనుమంతు అనే యువ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. మంగళవారం పొలానికి వెళ్లిన హనుమంతు తన పొలంలోనే పురుగుల మందు తాగాడు. గత మూడేళ్ల నుంచి అప్పులు అధికం కావడంతో అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. సుమారు రైతుకు రూ.4 లక్షల మేర అప్పులు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కోసిగికి చెందిన ఇద్దరు వ్యక్తులు వెంకటేశ్, తిక్కోడు మంగళవారం అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. 20 బాక్సుల్లో 1920 టెట్రా ప్యాకెట్లను, మూడు బైకులను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు కోసిగి ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. సజ్జలగుడ్డం రోడ్డులోని జగనన్న కాలనీ వైపున మూడు ద్విచక్ర వాహనాలపై ఇద్దరు మద్యందారులు 20 బాక్సుల్లో అక్రమ మద్యం తరలిస్తుండగా.. పట్టుకుని వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

ప్రజలకు పోలీసులు అండగా ఉండాలి: ఎస్పీ



బాధితురాలు గోవిందమ్మతో మాట్లాడుతున్న ఎస్పీ

ఆదోని రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎళ్లవేళలా ప్రజలకు, బాధితులకు పోలీసులు అండగా ఉండాలని ఎస్పీ బిందుమాధవ్ సూచించారు. ఆదోని రూరల్ పరిధిలో ఉన్న పెద్దతుంబళం, ఇస్వీ తాలుక పోలీస్ స్టేషన్లను మంగళవారం డీఎస్పీ సోమన్న, రూరల్ సీఐ నల్లన్నతో కలిసి ఎస్పీ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ మట్కా, పేకాట, అక్రమ మద్యం రవాణా, తదితర అసాంఘిక కార్యకలాపాలను నివారించాలని సూచించారు. పోలీసులు ప్రజల్లో మంచి పేరును తెచ్చుకోవాలన్నారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సీఐ గుణశేఖర్ బాబు, ఎస్ఐలు మహేష్, నాగేంద్ర, రామాంజనేయులు ఉన్నారు.

గోవిందమ్మకు ఎస్పీ పరామర్శ

పెద్దకడుబూరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): దళిత మహిళ గోవిందమ్మను ఎస్పీ బిందుమాధవ్ పరామర్శించారు. ఈ మేరకు ఆమె సొంత గ్రామం కల్లుకుంటను మంగళవారం సందర్శించారు. నెల రోజుల క్రితం గ్రామంలోని దళిత మహిళ గోవిందమ్మపై దాడి చేసిన సంఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి దళిత మహిళ గోవిందమ్మ ఇంటికెళ్లి ఆమెను పరామర్శించారు. 14 రోజులుగా దళిత మహిళ గోవిందమ్మ తన కు న్యాయం జరగాలని దీక్ష చేపట్టింది. దీంతో ఎస్పీ స్పందించి కల్లుకుంట గ్రామానికి చేరుకొని గోవిందమ్మను పరామర్శించారు. బాధితురాలు గోవిందమ్మతో మాట్లాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. బాధితురాలికి జరిగిన అన్యాయంపై 164 యాక్ట్ ద్వారా మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి ఆమెతో మాట్లాడించి స్టేట్‌మెంట్‌ను నమోదు చేయించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబును ఆదేశించారు. నిష్పక్షపాతంగా వ్యవహరించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐలు విక్రమ్‌సింహ, మంజునాథ్, ఎస్‌బీ సీఐ ప్రసాద్, ఎస్ఐలు నిరంజన్‌రెడ్డి, మహేష్‌కుమార్, చంద్రమోహన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సుదీర్ఘ పోరాటంతో వర్గీకరణ సాధించుకున్నాం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దండు రామకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ

పత్తికొండ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ పోరాటంతో ఎస్సీ వర్గీకరణను సాధించుకున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దండు రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపం వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు సుభాష్ చంద్ర మాదిగ ఆధ్వర్యంలో జరిగింది. దండు రామకృష్ణ మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం మంద కృష్ణ మాదిగ నాయకత్వాన ఎమ్మార్పీఎస్ పురుడు పోసుకుందని అన్నారు. నాటి నుంచి అలుపెరుగని పోరాటాలు చేశామని, దేశ అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఏబీసీడీ వర్గీకరణను అమలు చేసేందుకు ప్రస్తుత పాలకవర్గాలపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, జిల్లా నాయకులు మనోహర్, రవికుమార్, మనోజ్, సూరి, ఆంద్రయ్య, సంజప్ప, గాదెలింగప్ప పాల్గొన్నారు.

జిల్లా ప్రణాళికను రూపొందించండి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047కి సంబంధించిన జిల్లా ప్రణాళికను త్వరితగతిన రూపొందించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో స్వర్ణాంధ్ర-2047 జిల్లా ప్రణాళిక రూపకల్పనపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. పరిశ్రమల ఏర్పాటు, మార్కెటింగ్ హార్టికల్చర్, అభివృద్ధి, వ్యవసాయం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో సీపీవో హిమప్రభాకర్‌రాజు, ఏపీఐఐసీ జెడ్ఎం శ్రీనివాసరెడ్డి, ఐఐటీడీఎం డీన్ సత్యబాబు, కృష్ణారావు, మార్కెటింగ్ శాఖ ఏడీ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపేటలో ఘర్షణ

కర్నూలు క్రైమ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : టూటౌన్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బంగారుపేటలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. గుంతకల్లుకు చెందిన కొంత మంది బంగారుపేటలో మద్యం తాగేందుకు వచ్చారు. స్థానికంగా కొంత మందితో వీరికి ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో గుంతకల్లు చెందిన భరత్, పవన్‌లతో పాటు మరో ఇద్దరికి గాయాలు కాగా, బంగారుపేటకు చెందిన కృష్ణ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు అక్కడకు చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకుని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆస్పరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణ భారమై, జీవితంపై తీవ్రమైన నిరాశ కలిగి ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని అలిగేర గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన కరివేముల లక్ష్మన్న (44)కు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. కూలి పనులు చేసుకుంటూ ఇద్దరి కూతుళ్లకు వివాహం చేశాడు. మిగతా ఇద్దరూ కుమార్తెల వివాహం, కుటుంబ పోషణ భారమై ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి పారిపోయిన 45 రోజుల తరువాత పట్టుబడ్డ ఇంటర్ విద్యార్థి అనిల్ కుమార్‌ను మంగళవారం గోనెగండ్లలోని తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గోనెగండ్ల కు చెందిన పూజారి పద్మవతి, వెంకటేశ్వర్ల కుమారుడు అనిల్‌కుమార్ ఎమ్మిగనూరులో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. సరిగ్గా చదవడం లేదని తల్లిదండ్రులు మందలించారు. దీంతో అనిల్ కుమార్ గతనెల 1వ తేదిన తన స్నేహితుని ఇంటికి పోయివస్తానని చెప్పి పారిపోయాడు. గతనెల 4వ తేదిన విద్యార్థి తల్లిదండ్రులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ గంగాధర్ విద్యార్థి ఆచూకీ తెలుకోవడానికి ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణతో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు. వారు అని ప్రాంతాలలో విచారణ జరిపి చివరకు నందికొట్కూరులోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడని తెలుసుకొని అక్కడికి వెళ్లి అనిల్‌కుమార్ తీసుకువచ్చి మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించారు. 45 రోజుల తరువాత పిల్లవాడు చిక్కడంతో పోలీసులు, విద్యార్థి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

కోసిగి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతనూరు గ్రామానికి చెందిన కురువ మైత్రి (20) అనే యువతి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులు, కోసిగి ఎస్ఐ పి.చంద్రమోహన్ తెలిపిన వివరాలివీ.. ఈ నెల 13న సాయంత్రం సాతనూరులోని తన ఇంట్లో పురుగుల మందు తాగింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆదోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందిందని ఎస్ఐ తెలిపారు. మైత్రి కొన్ని నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతోందని, నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేసీ కాల్వలో మృతదేహం లభ్యం

జూపాడుబంగ్లా, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పగిడ్యాల మండలం బీరవోలు గ్రామానికి చెందిన రవికుమార్(24) అనే యువకుడి మృతదేహం మంగళవారం మండలంలోని తరిగోపుల గ్రామ సమీపంలోని కేసీ కాల్వలో లభ్యమైందని ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. యువకుడు గత రెండు రోజుల కిందట ఇంటి నుంచి బయటికి వెళ్లినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతికిగల కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

సంపులో పడి చిన్నారి మృతి

కర్నూలు క్రైమ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఐదేళ్ల బాలుడు అయాన్‌వలి చిన్నారి మృతి చెందాడు. దిగువపాడుకు చెందిన కాశీంవలి జోహరాపురం ఇందిరమ్మ కాలనీలో ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నాడు. ఇంటి సంపులో ఐదేళ్ల కొడుకు ఆడుకుంటూ వెళ్లి పడిపోయాడు. కొద్దిసేపటికి తర్వాత గుర్తించిన తండ్రి కాశీంవలి బాలుడుని బయటకు తీసి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు, అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 17న వాల్మీకి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడుతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్ బాషా ముఖ్య అతిథులుగా హాజరవుతారని, జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు వాల్మీకులందరూ భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రామయణాన్ని రచించిన మహనీయుని జయంతి వేడుకలను ప్రభుత్వం తరుపున నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేడు, రేపు భారీ వర్షాలు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధ, గురువారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులు వర్షాలను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పత్తి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

పీహెచ్‌సీ తనిఖీ

గడివేముల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రి పరిధిలోని గర్భిణిల వివరాల నమోదును, ఓపీపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వార్డులను, ల్యాబ్‌లను పరిశీలించారు. ఫ్రాంక్‌ను వేలం వేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం పని చేస్తున్న వైద్యాధికారి సెలవుపై వెళ్లడంతో మరోక వైద్యాధికారిని నియమిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వైద్యాధికారి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి'

మహానంది, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఎంపీపీ యశస్విని సూచించారు. మహానంది మండల సర్వసభ్య సమావేశం తిమ్మాపురంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని రెండు పీహెచ్‌సీలలో ఉన్న వైద్యాధికారులు అడ్వైజరీ సమావేశాలు కమిటీ చైర్మన్ అయిన తనను పిలవకుండా సమావేశాలు ఎలా నిర్వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, వైద్యాధికారులు భగవాన్‌దాస్, వెంకటరెడ్డి, ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి, ఎంఈవో రామసుబ్బయ్య, హౌసింగ్ ఏఈ షఫీవుల్లా, వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి, పీఆర్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, ఏపీఎం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా తాగునీటి పథకాలు

● తుప్పుపట్టిన యంత్రాలు ● ప్రజలకు అందని నీరు



నిరుపయోగంగా ఉన్న మైక్రో ఫిల్టర్లు



తుప్పు పట్టిన పైపులైన్లు



మూలన పడ్డ గ్యాస్ సిలిండర్

పాములపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీటిని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల రూపాయలు వెచ్చించి మంచినీటి పథకాలను ఏర్పాటు చేశారు. అయితే అధికారుల నిర్లక్ష్యంతో మూణాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయి నేడు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని ఎర్రగూడూరు గ్రామ శివార్లలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ నీటి సరఫరా ఉప విభాగం ద్వారా 2010లో సీపీడబ్ల్యూఎస్ స్కీం నుంచి రూ.25 లక్షలు వెచ్చించి జిల్లాలోనే ప్రప్రథమంగా మైక్రో ఫిల్టర్ల ద్వారా శుద్ధ జలాలను అందించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ వాటర్ స్కీమ్ నుంచి బానకచెర్ల, బానుముక్కల, శాంతినిలయం, ఎర్రగూడూరు, కరివేన గ్రామాలకు రోజుకు ఐదు లక్షల నీటిని సరఫరా చేయాల్సి ఉంది. అయితే ప్రారంభించిన ఏడాది పాటు నీటి సరఫరా జరిగింది. అయితే కాంట్రాక్టర్లు సరిగా నిర్వహించలేకపోవడం, మామూళ్ల మత్తులో అధికారులు పట్టించుకోక పోవడంతో లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన తాగునీటి పథకాలు ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారి యంత్రాలు తుప్పుపట్టిపోయాయి. ప్రభుత్వాలు మారుతున్నా నాయకులు గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని, ప్రభుత్వం ప్రజలు అవసరాలకు పథకాలను ఏర్పాటు చేస్తున్నా కనీసం తాగునీటికి నోచుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రభుత్వంలోనైనా మైక్రో ఫిల్టర్ స్కీమును పునఃప్రారంభించి తాగునీటిని అందించాలని, ప్రభుత్వ ధనాన్ని వృథా చేయకూడదని గ్రామస్థులు కోరుతున్నారు.

ట్రాఫిక్ ఐలాండ్స్ ఏర్పాటు

నంద్యాల క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రానున్న కార్తీకమాసం దృష్ట్యా శ్రీశైలం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆత్మకూరు డీఎస్పీ ఆర్.రామంజినాయక్ ఆధ్వర్యంలో శ్రీశైలం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు శ్రీశైలం క్షేత్రంలోని అన్ని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఐలాండ్స్ ఏర్పాటు చేశారు. ముఖ్యంగా శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంతంలోని నంది సర్కిల్ జంక్షన్, నంది మండపం జంక్షన్, మల్లికార్జున సదన్ జంక్షన్, అన్నదాన సత్రం జంక్షన్, సహస్ర హోటల్ జంక్షన్, పుష్కరిణి జంక్షన్, ఎస్బీఎంఎస్ హాస్పిటల్ జంక్షన్, బస్టాండ్ జంక్షన్, పాతాళ గంగ జంక్షన్ తదితర ప్రాంతాల్లో విజయవాడ కొత్తకావేరీ ఏజెన్సీవారు విరాళంగా ఇచ్చిన 10 పోలీస్ ట్రాఫిక్ ఐలాండ్స్ ఏర్పాటు చేశారు. వీటివల్ల భక్తులు, యాత్రికులు, ప్రయాణికుల వాహన రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉంటుందని పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆత్మకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ ఓబులేసు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కొందరు వ్యక్తులు పేకముక్కలతో జూదం ఆడుతున్నట్లు తమకు సమాచారం అందించినట్లు తెలిపారు. దీంతో తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా వారి వద్ద నుంచి రూ.1.03 లక్షల నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మహానంది: మండలంలోని సీతారామపురం- మోత్కల పల్లి గ్రామాల మధ్యన ఉన్న పంట పొలాల్లో నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సీతారామపురం సమీపంలో కొంతమంది పేకాట ఆడుతున్నారన్న సమా చారం మేరకు సిబ్బంది సహాయంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సీతారామపురానికి చెందిన నలుగురిని అరెస్టు చేశామని చెప్పారు. రూ.12,125 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. సీతారామపురానికి ఒకరు, అయ్యలూరుకు చెందిన ఒకరు పరారీ అయినట్లు ఎస్ఐ తెలిపారు.

'ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి'

నంద్యాల క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ చెయ్యడం అంటే ఒక వ్యక్తిని అవమానించడం, చికాకు లేదా భయం, బెదిరింపులాంటి వాటికి పాల్పడటం నేరమని, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని పోలీస్ అధికారులు తెలిపారు. ర్యాగింగ్ చేయడంవల్ల జరిగే పరిణామాలు, సైబర్ క్రైం నివారణపై మంగళవారం నంద్యాల త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా త్రీ టౌన్ సీఐ సూర్యమౌళి, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ జయరాములు, నంద్యాల అడ్వకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్‌లు హాజరుకాగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జయమ్మ, వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్ హాజరయ్యారు.

అడ్మిషన్లు ప్రారంభం

ఆత్మకూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ నాలుగో సంవత్సరానికి సంబంధించి హానర్స్ కోర్సులకు అడ్మిషన్లను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ జిష్ణు నాగ్ విజయ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం డిగ్రీ విద్య నాలుగేళ్లు ఉన్న నేపథ్యంలో గత ఏడాది మూడేళ్ల డిగ్రీ చేసిన విద్యార్థులకు నాలుగో సంవత్సరం హానర్స్ విద్యను పూర్తి చేసేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. మూడేళ్ల బీఎస్సీ బీజడ్‌సీ లేదా ఎంపీసీ డిగ్రీ కోర్సు పూర్తయిన విద్యార్థులకు బీఎస్సీ కెమిస్ట్రీ హానర్స్ అదేవిధంగా బీకామ్ కంప్యూటర్స్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బీకామ్ కంప్యూటర్స్ హానర్స్ కోర్సులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి 7801025096, 9908725069 నంబర్లను సంప్రదించాలని వెల్లడించారు.

ప్రగతికి బాటలు వేయడమే ప్రభుత్వ లక్ష్యం

'పల్లె పండుగ' కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు



చిందుకూరులో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత



వడ్డెమానులో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య



బి.కోడూరులో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

నందికొట్కూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రగతికి బాటలు వేయడమే ఉమ్మడి ప్రభుత్వ లక్ష్యం అని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. వడ్డెమాను గ్రామంలో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో గ్రామాలను పట్టించుకోకపోగా కేంద్రం నుంచి వచ్చిన నిధులను కూడా దారి మళ్లించారని అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, సర్పంచ్ రామచంద్రుడు, అధికారులు పాల్గొన్నారు.

మిడుతూరు: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పిలుపునిచ్చారు. మంగళవారం మిడుతూరు, చింతలపల్లి గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాలను తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో దశరథరామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల సమస్యల అర్జీలను ఎమ్మెల్యే జయసూర్య స్వీకరించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, టీడీపీ నాయకులు చెరుకుచెర్ల రఘురామయ్య, దామోదర్‌రెడ్డి, రామస్వామి రెడ్డి, సర్వోత్తమరెడ్డి, శివరామిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, నరసింహాగౌడ్, రవీంద్రబాబు, మనోహర్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, సుధాకర్, రాముడు, ఇద్రూష్, సుధాకర్‌రెడ్డి, నాగేంద్రుడు అధికారులు పాల్గొన్నారు.

గడివేముల: పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలలో మౌలిక సదుపాయాల రూపకల్పనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. గడివేముల, చిందుకూరు గ్రామంలో అభివృద్ధి పనులను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని అన్నారు. మండలంలో 37 పనులకు రూ.2.50 కోట్లు నిధులు మంజూరయ్యాయని అన్నారు. 18 మినీ గోకులాలు మంజూరయ్యాయని అన్నారు. ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేసి గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని అన్నారు. అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులు, వెలగమాను ఫీడర్‌చానల్ నిర్మాణాల ఆవశ్యకతను ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించామని అన్నారు. త్వరలోనే పనులు చేపట్టి రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎంపీడీవో వాసుదేవగుప్తా, తహసీల్దార్ వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, చిందుకూరు సర్పంచ్ అనసూయమ్మ, గడివేముల సర్పంచ్ రవణమ్మ, మాజీ కో-ఆప్షన్‌మెంబర్ రఫిక్, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, కృష్ణయాదవ్, సుదర్శన్‌రెడ్డి, హర్ష, ఈశ్వర్‌రెడ్డి, వడ్డు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పాములపాడు: పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా జూటూరులో ఎంపీడీవో చంద్రశేఖర్, టీడీపీ నాయకులు నాయిని కృష్ణయ్య, హఫీజ్ సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని హామీలను విడతల వారిగా నెరవేర్చి తీరుతుందని ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణ పురం, లింగా పురం, ఈర్నపాడు, బి. కోడూరు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. బి.కోడూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. ప్రస్తుతం శ్రీశైలం నియోజకవర్గంలో రూ.20 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. బండిఆత్మకూరులో రూ.2 కోట్లకు పైగా నిధులు వెచ్చించి సీసీ రోడ్లు వేస్తున్నామని చెప్పారు. టీడీపీ నాయకులు సురేష్‌రెడ్డి, నరసింహారెడ్డి, డాక్టర్ భరద్వాజశర్మ, కంచర్ల మనోహర్‌చౌదరి, రాముడు, రామచంద్రుడు, ఆంబ్రోస్, శంకర్, బాబు, సాయిబాబారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రతాపరెడ్డి, రామకృష్ణారెడ్డి, బాలుడు, చలమయ్య, ప్రతాప్ పాల్గొన్నారు.

మహానంది: అబ్బీపురం గ్రామంలో మంగళవారం మాజీ ఎంపీటీసీ దస్తగిరి ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ యశస్విని హాజరై సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. యి.బొల్లవరంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. టీడీపీ నాయకుడు కిలార్ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

వెలుగోడు: రేగడగూడూరులో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, అంబాల రామసుబ్బారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: తూడిచర్లలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సీసీరోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లుయాదవ్ టీడీపీ నాయకులు సురేష్‌యాదవ్, వేణుగోపాల్‌యాదవ్, మద్దిలేటి యాదవ్, రెడ్డిసుబ్బయ్య, పెద్దస్వామి, వార్డుసభ్యులు సురేష్, శంకర్, శ్రీనివాసులు, జమ్ములయ్య, అధికారులు పాల్గొన్నారు.

పగిడ్యాల: బీరవోలులో పల్లెపండుగ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ పాఠశాల సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణాన్నికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వమించారు. టీడీపీ నాయకులు దామోదర్‌రెడ్డి, వాసురెడ్డి, అధికారులు ఉన్నారు.

కొత్తపల్లి: గువ్వలకుంట్ల గ్రామంలో సర్పంచ్ మశమ్మ ఆధ్వర్యంలో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వివిధ కాలనీలకు సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు పోత సహదేవుడు, జానకీరాముడు, నారాయణ, సత్యరాజు, యేసేపు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



మాట్లాడుతున్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్

మహానంది, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎం.తిమ్మాపురంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశా లలో మంగళవారం అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయిలు, స్కౌట్ విద్యార్థులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీర్‌బాషా, ఉపాధ్యాయిడు వెంకటేశ్వర్లు, ప్రతాపరెడ్డి, కృష్ణమూర్తి, అసిఫాభాను, మౌనిక, శైలజ పాల్గొన్నారు.

ఆత్మకూరు: భారతజాతి గర్వించదగ్గ గొప్ప మేధావి, క్షిపణి పితామహుడు, భావితరాలకు మార్గదర్శి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తి దేశానికే ఆదర్శమని ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్ పేర్కొన్నారు. మంగళవారం భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 93వ జయంతి వేడుకలను స్థానిక జగద్గురు మఠంలో డాక్టర్ అబ్దుల్ కలాం స్మారక సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన వెంకటసుబ్బయ్యఆచారీ, రామ్‌ప్రసాద్, యుగంధర్, సలాం, రుక్మిణీదేవీ, అల్తాఫ్‌హుసున్‌లను ఘనంగా సత్కరించారు. అలాగే చెంచు మహిళలకు, మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. ఎంఈవో సురేష్, డాక్టర్ అబ్దుల్ కలాం స్మారక సమితి ప్రతినిధులు జవహర్‌నాయక్, శీలం శేషు, వాసుదేవరెడ్డి, నరసింహానాయక్ తదితరులు ఉన్నారు.

● ఆత్మకూరులోని నంద్యాల టర్నింగ్‌లో గల కృషి పండ్ల తోటల రైతు సేవా కేంద్రంలో మంగళవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. సంఘం నాయకులు మహెబూబ్‌బాషా, మోమిన్ మునీర్‌బాషా పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: పట్టణంలోని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కార్యాలయంలో మంగళవారం అబ్దుల్‌కలాం జయంతిని నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రహీం, సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ శివరామిరెడ్డి, కోశాధికారి రహంతుల్లా, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వర స్వామికి ఆర్జిత సేవ



నందీశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో మంగళవారం త్రయోదశి ఘడియ లను పురస్కరించుకొని సాయంప్రదోషకాలంలో ఆలయంలోని మల్లికార్జునస్వామికి అభి ముఖంగా కొలువైవున్న నందీశ్వరస్వామికి పరోక్ష సేవగా విశేష అభిషేకం, అర్చనలు జరిపించారు. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతి పూజ నిర్వహించారు. అభిషేకానం తరం నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ, విశేష అర్చనలు నిర్వహించారు. శ్రీశైల క్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో పూజలలో పాల్గొనేందుకు దేవస్థానం పరోక్షసేవల ద్వారా అవకాశం కల్పించింది. భక్తులు ఈ పరోక్షసేవలో పాల్గొనేందుకు దేవస్థానం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.శ్రీశైలదేవస్థానం.ఓఆర్‌జీ ద్వారా ఒక్కో పూజకు రూ. 1,116 సేవా రుసుమును చెల్లించి పాల్గొనవచ్చును. సేవాకర్తలే కాకుండా, భక్తులందరూ కూడా నందీశ్వరస్వామి ఆర్జిత పరోక్షసేవ పూజా కార్యక్రమాన్ని శ్రీశైల టీవీ లేదా యూట్యూబ్ ద్వారా వీక్షించవచ్చును.

● ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. నిత్యకళారాధనలో మంగళవారం నల్గొండకు చెందిన హైందవిరెడ్డి బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

నంద్యాల రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలంలోని చాపిరేవుల, చాబోలు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో ప్రసాదరావు వరి పంటలను పరిశీలించారు. అనంతరం ఏవో ప్రసాదరావ్ మాట్లాడుతూ సాలు వరిలో నీటిలభ్యత తక్కువైనా మంచి దిగుబడులు వస్తాయన్నారు. కలుపు నియంత్రణ కూడా చేసుకోవాలని సూచించారు. పశు సంవర్ధకశాఖ అధికారి మల్లేశ్వరి మాట్లాడుతూ పశువులలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఉద్యాన పంటలైన మిరపలో రసంపీల్చు నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని పిలుపునిచ్చారు.

జూపాడుబంగ్లా: తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సూచనలతో సస్యరక్షణచర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని తరిగోపుల, 80బన్నూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులకోసం రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని చెప్పారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాములపాడు: మండల వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, పాటించి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం పొలంబడి కార్యక్రమంలో బాగంగా రైతులకు అవగాన కల్పించారు. వారు మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పాటించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. సెరికల్చర్ అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ రాయి రాయితీలో మల్బరి షెడ్లు నిర్మించుకోడానికి ఆసక్తిగల రైతులు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఈ నెల 16వ తేదీలోపు పంట నమోదులో తప్పులు ఏవైనా ఉంటే సరి చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ కేంద్రం అధికారి హేమలత సూచించారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అదే విదంగా గ్రామ శివారులోని పంట పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కె.మహేష్, ఉద్యాన శాఖ అధికారి చందన, పట్టుపరిశ్రమల శాఖ అధికారి లింగమూర్తి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బాషా, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అర్బన్‌రైతు సేవా కేంద్రం, బావనంతాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి రాజశేఖర్, ఎంపీఈవోలు రవిగౌడ్, శ్రీను, రైతు, కౌలు రైతు సంఘం నాయకులు మహబూబ్‌బాషా, టపాల్ అష్రఫ్ అలీ, రైతులు పాల్గొన్నారు.

డిస్లెక్సియా నివారణపై అవగాహన

పాములపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పాములపాడులో భవిత సెంటర్ ఆవరణలో డిస్లెక్సియా నివారణపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. మంగళవారం కో ఆర్డినేటరు షంషుద్దీన్ మాట్లాడుతూ డిస్లెక్సియా వ్యాధి సోకిన వారు సరిగా చదవలేరని, రాయలేరని, పక్షవాతం వచ్చిన వారిలా ఉంటారని అన్నారు వ్యాధికి సంభందించిన వైద్యుల సలహాలు సూచనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నారులు పాల్గొన్నారు.

కొత్తూరులో కర్నూలు డీసీసీ అధ్యక్షుడి పూజలు

పాణ్యం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కోడుమూరు మాజీ ఎమ్మెల్యే, కర్నూలు డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాలువా, పూలమాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు రోహిత్ శర్మ, కిట్టయ్యస్వామి, ఆలయసిబ్బంది సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'బస్టాప్ ఏర్పాటు చేయాలి'

నందికొట్కూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగనన్న కాలనీకి ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని ప్రజలు ఆర్టీసీ అధికారిణి సరోజమ్మకు వినతి పత్రం ఇచ్చారు. ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, స్వామన్న, స్వాములు నాయుడు, షేక్షావలి, మా బాషా, వెంకటరమణ, హుసేన్, జనార్దన్ పాల్గొన్నారు.

'సిబ్బందిని అప్రమత్తం చేశాం'

నంద్యాల రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో కురుస్తున్న వర్షాలకు ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండేలాగా సూచనలు చేసినట్లు విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సుధాకర్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో మాట్లాడుతూ ఎక్కడైనా ప్రజలు గానీ, పశువులు గానీ తడిసిన స్తంభాలను తాకకుండా ఉండేలా సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

వెండి కిరీటం బహూకరణ

పగిడ్యాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమర ప్రాతకోటలోని అభయాంజనేయస్వామికి భక్తులు వెండి కిరీటాన్ని మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన కురువ శివమల్లయ్య కుమారులు మల్లికార్జున, సుధాకర్ వెండి కిరీటం బహూకరించారు. సుమారు 50 తులాల వెండితో తయారు చేసిన కిరీటంను అందజేశారు. ఆలయ పూజారి జగదీశ్వరయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'జాగ్రత్తగా ఉండాలి'

మిడుతూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మిడుతూరు సమ్మర్ స్టోరేజ్ ఆవరణలో చిరుత పులి సంచరిస్తుందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వెలుగోడు రేంజర్ ఎంఏ ఖాన్ సూచించారు గత రెండు రోజుల నుంచి చిరుత పులి సంచరిస్తుందని పత్రికల్లో వచ్చిన కథనాల మేరకు ఫారెస్టు అధికారులు స్పందించారు. ఈ విషయంపై మంగళవారం మిడుతూరు సమ్మర్ స్టోరేజ్ దగ్గరకు ఫారెస్టు రేంజర్ ఎమ్ఏ ఖాన్ సిబ్బందితో చేరుకుని చిరుత పులి తిరిగిన అడుగు జాడలను గుర్తించారు. చిరుత తిరిగిన పరిసర ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు రేంజర్ అన్నారు. పొలాలకు వెళ్లు రైతులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

'సమస్యలు లేకుండా చూడాలి'

కొత్తపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో రెవెన్యూ శాఖ పరిధిలో ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భూ సమస్యలు, ఆన్‌లైన్ సమస్యలు, పొలాల కొలతల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి రెవెన్యూ అధికారి పని చేయాలన్నారు.

వాల్మీకి జయంతిని జయప్రదం చేయండి



వాల్మీకి జయంతి కరపత్రాలను విడుదల చేస్తున్న వలసల రామకృష్ణ

డోన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో ఈనెల 17న నిర్వహించనున్న వాల్మీకి జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో వాల్మీకి జయంతి పోస్టర్లను వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో విడుదల చేశారు. వాల్మీకి జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు అబ్బిరెడ్డిపల్లె గోవిందు, చిన్న మల్కి, ఉడుములపాడు నాగేంద్ర, తిరుపాల్‌నాయుడు, శ్రీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మిరప సాగులో మెలకువలు పాటించండి



రైతులతో మాట్లాడుతున్న హెచ్‌వో ధరణి

ఉయ్యాలవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మిరప పంట సాగులో రైతులు మెలకువలు పాటించాలని కోవెలకుంట్ల డివిజన్ అగ్రికల్చర్ అధికారి ధరణి తెలిపారు. మంగళవారం ఇంజేడు, అల్లూరు, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో పర్యటించి మిరప పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అధిక వర్షపాతం వల్ల ముఖ్య తలలు వాలినట్లు అనిపిస్తే అధికారులను సంప్రదించి మందులు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ సరళ, రైతులు నరసింహుడు, ఉసేనయ్య ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఉయ్యాలవాడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వెలుగు ఏపీఎం దాసన్న తెలిపారు. మంగళవారం ఇంజేడు గ్రామంలో చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతుల పరిశుభ్రత ఎంతో ముఖ్యం అన్నారు. చేతులు కడగకుండా ఆహార పదార్థాలు ముట్టవద్దన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు 30 శాతం సబ్సిడీ: ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే పొదుపు మహిళలకు ప్రభుత్వం రూ. లక్షకు రూ. 30 వేల సబ్సిడీ అందిస్తున్నట్లు ఏపీఎం దాసన్న తెలిపారు. మండలంలో ఉయ్యాలవాడ, మాయలూరు గ్రామాల్లో ఇద్దరు మహిళలకు రెండు యూనిట్లు మంజూరు అయ్యాయన్నారు. ఆసక్తి గల మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ప్యాపిలి: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని హెల్త్ ఎడ్యుకేటర్ రామచెండ్రుగౌడు అన్నారు. పట్టణంలోని బీసీ కాలనీ యూపీ పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సులపై కొరడా



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్టీవో

డోన్(రూరల్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ ముగియడంతో తిరుగు ప్రయాణం అవుతున్న ట్రావెల్ బస్సులపై డోన్ ఆర్టీవో అధికారులు కొరడా ఝుళిపించారు. పట్టణ సమీపంలోని టోల్ ప్లాజా వద్ద సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ట్రావెల్ బస్సులను తనిఖీలు చేశారు. ఈ ట్రావెల్ బస్సులపై రూ.4.54 లక్షలు జరిమానాలు విధించినట్లు డోన్ ఆర్టీవో క్రాంతి కుమార్ తెలిపారు. అలాగే అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలను గుర్తించి రూ.1.15 లక్షలు జరిమానా విధించామన్నారు.


ధార్మిక చింతన అలవర్చుకోవాలి

సంజామల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : ప్రతి హిందువు ధార్మిక చింతన అలవర్చుకోవాలని నెరవాటి పాండురంగ నంద భారతి స్వామి సూచించారు. మంగళవారం ఆల్వకొండ క్రాస్‌రోడ్డు వద్ద వెలిసిన కోనేయన ఆశ్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ అంబటి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో హిందూ ధర్మ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాండురంగ నంద భారతి స్వామి, రుక్మిణీ మాతాజీ, ఆనంద భారతి స్వామి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక భజన బృందాలు పాల్గొని ప్రత్యేక భజనలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ పెద్దలు చంద్రమౌళేశ్వర రెడ్డి, శివ శంకర్ రెడ్డి, ఆర్.ఎస్.ఎస్ విభాగ్ జిల్లా ధర్మ ప్రచారక్ సుధాకర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి చర్యలు తీసుకోవాలి

చాగలమర్రి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మంజులవాణి కార్యదర్శులకు సూచించారు. మంగళవారం మండలంలోని గొడిగనూరు గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు, అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిలిచిన మురుగును, కొళాయిని పరిశీలించారు. పారిశుధ్యం లోపంపై ఎంపీడీవో అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, గ్రామ టీడీపీ నాయకులు, సిబ్బంది ఉన్నారు.

ఎగువలో ముగిసిన పవిత్రోత్సవాలు



శ్రీదేవి, భూదేవి సమేత జ్వాలా నరసింహ స్వామి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 15 (ఆం ధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలంలో పవిత్రోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. జ్వాలా నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పవిత్రాలను ధరింపజేశారు. హోమ మండపంలో స్వామి, అమ్మవార్లకు ఎదురుగా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం మంగళహారతి, తీర్థప్రసాద గోష్టి చేపట్టారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుదీర్చి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

12 టన్నుల పశుదాణా పంపిణీ

చాగలమర్రి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రైతులకు పశుదాణా పంపిణీ చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ వర్షప్రసాద్ తెలిపారు. మంగళవారం జిల్లా నుంచి సరఫరా అయిన సమీకృత దాణాను పంపిణీ చేశారు. 12 టన్నుల పశుదాణా మంజూరైందని తెలిపారు. 15 మంది రైతులకు 25 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 16నుంచి గొర్రెలు, మేకలకు నట్టల నివారణ కోసం డీవార్మింగ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిఘా నేత్రం నేల చూపు

● పట్టించుకునేవారేరీ?

రుద్రవరం, అక్టోబరు 15 : గ్రామాల్లో చోరీలు జరిగినా ఏ ఇతర సంఘటనలు జరిగినా సీసీ కెమెరాలు ఆధారం



ప్రధాన వీధిలో నేల వైపు చూస్తున్న సీసీ కెమెరా

పోలీసులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. కానీ రుద్రవరం మండల కేంద్రంలో నిఘా నేత్రం నేల చూస్తోంది. సుమారు మూడేళ్లక్రితం ప్రజలు ఇచ్చిన విరాళాలతో రుద్రవరంలో సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు.సీసీ కెమెరాలు ఒక్కటికూడా పని చేయడంలేదు. గ్రామాల్లో పోట్లీలు చోరీ గురవుతున్నాయి. ఇటీవల ఓ దిన్నారిని కారులో ఎత్తుకెళ్లే యత్నం చేసిన విషయం విదితమే. ఇలాకొన్నిసంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. సీసీ కెమెరాలు మాత్రం నేల చూస్తున్నాయి. ప్రధానంగా పాఠశాలలు, దేవాలయాలు జనరద్దీగా ఉన్న ప్రాంతాల్లో ఇంకా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. ప్రజాధనం వృథా అయిందే తప్ప సీసీకెమెరాలు పనిచేయడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.





రుద్రవరంలోని ఉన్నత పాఠశాల, ఫారెస్టు బంగ్లా వెళ్లే రహదారిలో పని చేయని సీసీ కెమెరాలు

సీసీ కెమెరాలను అందుబాటులోకి తెస్తాం



సీసీ కెమెరా పోలీసుశాఖకు చాలా ఆధారంగా ఉంటుంది. ఎక్కడ ఖచ్చ పనిచేయలేదో వాటిని పరిశీలించి పనిచేసేలా మరమ్మతులు చేయిస్తాం. సీసీ కెమెరాలను అందుబాటులోకి తెస్తాం.

- వరప్రసాద్, ఎస్ఐ ,రుద్రవరం

పేదల కలలు నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదల కలలు నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ ఆళ్లగడ్డ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను నియమించడంతో విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆయనను జగత్ విఖ్యాత్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేపడుతున్న ప్రణాళికలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమాన్ని భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు.

తడిచిన ధాన్యం

రుద్రవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. ఈ వర్షానికి కొండమాయపల్లె, యల్లావత్తుల, కోటకొండ, ఆలమూరు, రుద్రవరం గ్రామాల్లో మొక్కజొన్నలు, ఆలమూరు సమీపంలో ఎండుమిర్చి, కొండమాయపల్లె సమీపంలో వేరుశనగ తడిసిపోయింది. దాంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే



దొర్నిపాడులో వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

దొర్నిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ లక్ష్యమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని దొర్నిపాడు సహకార సంఘ స్టోరేజీ ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు భూమా సంతోష్‌రెడ్డి, సిద్ది సత్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు.

మండలాన్ని అభివృద్ధి చేస్తా

దొర్నిపాడు మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ ఆమీనాబీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటికి నీటి కొళాయిలు, ఇళ్లు లేని వారికి రెండు సెంట్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామాల్లో ఏదైనా సమస్యలు ఉంటే ఆయా శాఖల అధికారులు వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు వెంటనే ఇవ్వాలని ఎంపీడీవో సావిత్రికి ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ డీఈ లక్ష్మీనరసింహ, ఎంపీడీవో సావిత్రి, టీడీపీ నాయకులు భూమా సంతోష్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, విద్యుత్ ఏఈ రామ్మోహన్, వైద్యాధికారి రుహుల్లాఖాన్, టీడీపీ నాయకులు భూమా సందీప్‌రెడ్డి, కాశీవిశ్వనాథ్ రెడ్డి, సిద్ది సత్యం, బబ్బూరి కృష్ణ, దయానంద రావు, బబ్బూరి వెంకటస్వామి, తాళ్లూరి రమేష్ నాయుడు, సురేంద్ర, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పల్లెల్లో రూపు రేఖలు మార్చడమే లక్ష్యం

పల్లెల్లో రూపు రేఖలు మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా గోవిందిన్నె, దొర్నిపాడు గ్రామాల్లో సీసీ రోడ్లకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో రూ.20 లక్షలు, దొర్నిపాడులో రూ.58 లక్షలతో సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేశారు. అంతకుముందు డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలోని మూల పెద్దమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు పూలమాలలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భూమా సందీప్‌రెడ్డి, భూమా సంతోష్‌రెడ్డి, కాశీ విశ్వనాథ్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో సావిత్రి, అంజి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా పవిత్రోత్సవం



చాగలమర్రిలో కుంకుమార్చన చేస్తున్న వేద పండితులు, మహిళలు

చాగలమర్రి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వేద పండితులు పెద్దశాస్త్రి ఆధ్వర్యంలో వైభవంగా పవిత్రోత్సవం, కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు సామూహికంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. 10 రోజుల పాటు దసరా ఉత్సవాలు నిర్వహించిన విజయవంతం కావడంతో అమ్మవారికి శాంతి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పొన్ను సేవలో కొలువైన అమ్మవారు

రుద్రవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన రుద్రవరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారు పొన్ను సేవలో కొలువుదీరారు. అమ్మవారి అలంకారం భక్తులను ఆకట్టుకుంది. ఆర్యవైశ్యులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థినికి గాయాలు

డోన్(రూరల్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం సమీపంలోని మోడల్ స్కూల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థిని ప్రమాదానికి గురైంది. మోడల్ స్కూల్ నుంచి విద్యార్థులను ఎక్కించుకుని వచ్చే విద్యార్థి బస్సు పాఠశాల ప్రాంగణంలో రివర్సు తీసుకునే క్రమంలో సీట్ల కోసం విద్యార్థులు ఎగబడటంతో 7వ తరగతి విద్యార్థిని ప్రమాదవశాత్తు జారి బస్సు టైరు కింద పడటంతో గాయలయ్యాయి. విద్యార్థిని చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది.

ఘనంగా సమాచార హక్కు వారోత్సవాలు

డోన్(రూరల్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సమాచార హక్కు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా రూరల్ సీఐ రాకేష్‌కు సమాచార హక్కు చట్టం హైలెవల్ కమిటీ సభ్యులు షేక్ దామోదర్ పులమాలలు, శాలువాలతో సత్కరించారు. సమాచారహక్కు చట్టం కింద దరఖాస్తులు చేసుకునే వారికి అవినీతి రహిత సమాజం కోసం పాటు పడే వారికి పోలీసులు రక్షణగా ఉండాలని ఈ సందర్భంగా ఫుడ్‌మామోదర్ ఆకాంక్షించారు.

ఘనంగా దస్తగిరి స్వామి ఉరుసు

బనగానపల్లె, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని జెండావీధిసాహెబ్ దర్గా వద్ద, కూరగాయల మార్కెట్ వద్ద వెలసిన దర్గా వద్ద దస్తగిరి స్వామి ఉరుసు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలు దర్గాకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న దర్గా వద్ద ఖవ్వాలి వేడుకలు పలువురిని ఆకట్టుకున్నాయి. అలాగే మీరాపురం తదితర గ్రామాల్లో దస్తగిరి స్వామి గ్యార్లీ పండుగ నిర్వహించారు. దర్గాల వద్ద జెండాలు ఎక్కించి వేడుకలు నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే కోట్ల



ఆర్.కొత్తపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆర్‌కొత్తపల్లి, ఆర్‌బుక్కాపురం గ్రామాల్లో అధికారులు నిర్వహించిన పల్లె పండుగ వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోట్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌కొత్తపల్లి గ్రామంలో సీసీ రోడ్డు ఏర్పాటుకు ఆయన భూమి పూజలు చేశారు. సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని అన్నారు. ఆర్‌బుక్కాపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన పూజ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి పల్లె పండుగ నిర్వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఎంపీడీవో షబీల్ రెహమాన్, ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు టీడీపీ సీనియర్ నాయకులు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, ఆర్‌బుక్కాపురం సర్పంచ్ నాగరాజు, నాయకులు మునీశ్వర్ రెడ్డి, లక్ష్మన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే ప్రజావేదిక లక్ష్యం

మండలంలోని వివిధ గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాసమస్యల పరిష్కార వేదిక లక్ష్యమని, ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గ్రీవెన్స్ సెల్ ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అధికారులతో కలిసి ఎమ్మెల్యే నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాష్‌బాబు, నోడల్ అధికారి జబీఉన్‌నీ, ఎంపీడీవో షబీల్ రెహమాన్, సీఐ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, హౌసింగ్ ఏఈలు రాజశేఖర్ రెడ్డి, మహేష్, రామ్మోహన్ రెడ్డి, పశుసంవర్ధకశాఖ ఏడీ వసంతలక్ష్మి, ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, ఎరుకుల శివ, శివప్రసాద్ రెడ్డి, ఎస్ఐ రమేష్‌బాబు, నాయకులు రాజెన్, మేకల నాగరాజు పాల్గొన్నారు.

మిరపకు సోకిన వైరస్‌ను నివారించండి

సంజామల, అక్టోబరు 15: మిరప పంటకు సోకిన వైరస్‌ను నివారించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి రైతులను కోరారు. మంగళవారం ముదిగేడు రైతు సేవా కేంద్రంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి, మిరప పంటలకు సోకే బీడ పీడలను గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వి.ఏ.ఏలు, రైతులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాలకు ఎన్నికలు

చాగలమర్రి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ కేసీ కెనాల్ పరిధిలోని 28 సాగునీటి సంఘాలు, 336 టీసీలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. 16న సాగునీటి సంఘాలకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కేసీకెనాల్ పరిధిలో 99,194 ఎకరాల ఆయకట్టు ఉంది. చాగలమర్రి మండలంలో మల్లేవేముల, చాగలమర్రి గ్రామాల్లో 2 టీసీలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఆయా టీసీల పరిధిలో ఓటర్ల జాబితాను రెవెన్యూ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని మల్లేవేముల, పెద్దబోధనం టీసీలకు ఎన్నికలు జరుగుతాయి. మండలంలోని మూడు చెరువులకు సాగునీటి సంఘ అధ్యక్షులు, డైరెక్టర్ల ఎన్నికలకు ప్రణాళిక సిద్ధం చేశారు. తెలుగుగంగ ప్రధాన కాలువ కింద 2 నీటి సంఘాలకు ఎన్నికల నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. సాగునీటి సంఘ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్ పదవులకు సంబంధించి ఓటర్ల జాబితాను రెవెన్యూ అధికారులు సిద్ధం చేస్తున్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీడీ

బేతంచెర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు, వైద్య సిబ్బంది పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు సూచించారు. మంగళవారం పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు, జిల్లా మలేరియాశాఖ అధికారి కామేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను సందర్శించి పలు రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం పట్టణంలోని ఆరోగ్య కేంద్రం-3 ను సందర్శించి అక్కడి రోగులకు అందుతున్న సేవలను వైద్య సిబ్బంది పనితీరును డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే కోటపేట నందలి డెంగ్యూ కేసును పరిశీలించి అక్కడ ఉన్న నీటి తొట్టెను పరిశీలించి దోమ లార్వాలను పారబోయించారు. అక్కడ ఉన్న ప్రజలను ఉద్దేశించి డ్రైడే, డ్రైడే కార్యక్రమం వివరించారు. వైద్యాధికారి డా.ప్రియాంక, మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, సహాయ మలేరియా అధికారి వరప్రసాదరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైకు

ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

ప్యాపిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగుమర్రి గ్రామం సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. డోన్ పట్టణానికి చెందిన విష్ణు (25), అదే మండలం ఉంగరానిగుండ్ల గ్రామానికి చెందిన మధు ఇద్దరు మిత్రులు. ఇద్దరు కలిసి పని నిమిత్తం బైకుపై గుత్తికి బయలుదేరారు. మార్గం మధ్యలోని ఏనుగుమర్రి గ్రామం దగ్గరకు రాగానే బైకు అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో విష్ణు అక్కడికక్కడే మృతి చెందగా మధుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు బాధితుడిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం కర్నూలు తరలించారు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన

ఉయ్యాలవాడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు రఘురామిరెడ్డి తెలిపారు. మంగళవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను కలిసి విద్యనేగా ఆదించాలన్నారు. దీనికి దివ్యాంగ తల్లిదండ్రులు సహకరించి తమ పిల్లలను భవిత సెంటర్‌కు పంపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెగ్యులర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదాము, సీఆర్పీలు లక్ష్మీదేవి, లక్ష్మీదేవి, సిద్దమ్మ పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

కేసు నమోదు

బనగానపల్లె, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నందివర్గ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గోస్పాడు మండలం దీబగుంట గ్రామానికి చెందిన బాలచంద్రుడుకు, పలుకూరుకు చెందిన సునీతకు ఏడాది కిందట వివాహం అయింది. రూ.15లక్షల నగదు, 18 తులాల బంగారు ఇచ్చి సునీత తల్లిదండ్రులు వివాహం జరిపించారు. అయితే అదనపు కట్నం తేవాలని భర్త బాలచంద్రుడు, మామ చెన్నరాయుడు, అత్త గంగారాం లక్ష్మమ్మ, బావ చెన్నకేశవులు శారీరకంగా, మానసికంగా హింసించేవారని సునీత ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దీంతో సునీత ఫిర్యాదు మేరకు భర్త, అత్త, మామ, బావలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం కేసులో నిందితుడి అరెస్టు

మండలంలోని కైప గ్రామంలో అదే గ్రామానికి చెందిన సరేశ్ అనే వ్యక్తి మద్యం అమ్ముతుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. అతని వద్ద మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొలిమిగుండ్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు పులి ప్రకాశ్‌రెడ్డి కుటుంబాన్ని అవుకు జడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మి పరామర్శించారు. మంగళవారం గొర్విమానుపల్లె గ్రామానికి చేరుకుని సీనియర్ నాయకుడు పులి తిమ్మారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు పులి ప్రకాశ్‌రెడ్డి, పులి నరసింహారెడ్డి, సుదర్శన్‌రెడ్డిలను పరామర్శించారు. పులి ప్రకాశ్‌రెడ్డి కుటుంబంతో చల్లా కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందని చల్లా శ్రీలక్ష్మి గుర్తు చేసుకున్నారు.

అధికారులను కలిసిన రాజారావు

రుద్రవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, టీడీపీ నంద్యాల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీడీవో బాగ్యలక్ష్మిని, ఏపీవో సుబ్రమణ్యం, మీరావలి కమాల్‌బాషాలకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పల్లెసీమలు అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాలల తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల ద్వారా ఉపాధి అవకాశాలు



ప్రజాభిప్రాయాలను తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కౌతాళం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇసుక రీచ్ ప్రాంతాలలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించి వలసలను అరికట్టవచ్చని జాయింట్ కలెక్టర్ నవ్య అన్నారు. మండలంలోని గుడికంబాలి, మరళి, నదిచాగి గ్రామాలలో మంగళవారం జాయింట్ కలెక్టర్ నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా మైనింగ్ అధికారులు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ శాఖ అధికారులు తహసీల్దార్ మల్లికార్జునస్వామితో కలిసి ఆయా గ్రామాల్లోని ఇసుక రీచ్‌ల ఏర్పాట్లపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రీచ్‌ల వద్ద ప్రభుత్వ ఉత్వర్వుల మేరకు నదిలోని ఇసుకను డంపు చేసుకుంటామని నదులలో 1మీటరు లోతు వరకు మాత్రమే తోడి పర్యావరణ అనుమతుల ప్రకారం ఇసుకను డంపు చేస్తారని తెలిపారు. ప్రజల సలహాలు, సూచనలు నమోదు చేసుకుని నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు. వీరి వెంట మైనింగ్ డీడీ రవిచంద్, ఇరిగేషన్ ఈఈ శైలేశ్వరరావు, తహసీల్దార్ మల్లికార్జునస్వామి, వీఆర్వో నాగర్జున, గ్రామస్థులు గోపాల్ నాయక్, బసవరాజులు సిద్దేశ్, మల్లయ్య, మహేష్ ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి

గోనెగండ్ల తహసీల్దార్ కుమారస్వామి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



గోనెగండ్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. మండలంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రేషన్ సమస్యలు కూడా ఉంటే ప్రజలు మా దృష్టికి తీసుకొస్తే వాటిని కూడా వెంటనే పరిష్కరిస్తామన్నారు.

ప్రశ్న: గోనెగండ్లలో ఎలాంటి భూ సమస్యలు మీ దృష్టికి వచ్చాయి?

జవాబు: గోనెగండ్ల మండలాన్ని ప్రభుత్వం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. దీంతో మండలంలోని 15 గ్రామాల్లో భూ సర్వేలు చేశారు. ఇంకా మిగిలిన ఐదు గ్రామాల్లో సర్వేలు చేయాల్సి ఉంది. అయితే ఒక కుటుంబంలో ని ఇద్దరు అంతకు మించి ఉన్న అన్నదమ్ముల ఆస్థులకు జాయింట్ ఎల్‌పీ ఇవ్వడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. సబ్ డివిజన్ చేసి సమస్యను పరిష్కరిస్తాం.

ప్ర: ఎన్ని నెలలు రేషన్ తీసుకోకపోతే రేషన్ కట్ అవుతుంది?

జ: ప్రతి నెల 17వ తేదీ వరకు గ్రామాలలో రేషన్ బండ్లు వీధుల్లోకి వచ్చి ప్రజలకు రేషన్ అందిస్తుంది. అయితే అరు నెలల లోపు ఒక్కసారైనా రేషన్ తీసుకున్నట్లు తంబ్ వేయాలి లేకపోతే రేషన్ కట్ అవుతుందని వినికిడి. అధికారికంగా మాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందలేదు.

ప్ర: పట్టాదారుపాసు పుస్తకాలు ఎన్ని రోజుల్లో అం దుతుంది?

జ: పట్టాదారు పాసు పుస్తకం సంబంధించి దరఖాస్తు చేసుకున్న వెంటనే విచారణ చేసి ఉన్నతాధికారులు పంపుతాం. అక్కడి నుంచి పాస్‌పుస్తకం ప్రింట్ అయి రావడానికి దాదాపు మూడు మాసాలు పడుతుంది. అదికూడా నేరుగా రైతు ఇంటికే చేరుతుంది.

ప్ర: గ్రావెల్, ఇసుక తరలింపుపై?

జ: ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రావెల్ తరలింపునకు అధికారుల అనుమతి తీసుకోవాలి. లేకపోతే కేసు నమోదు చేస్తాం. ఇసుక రీచ్ గోనెగండ్లలో లేదు. రీచ్ ఉన్న చోట నుంచే ఇసుకను తీసుకోవాలి. అక్రమంగా తరలించినట్లు మాకు తెలిస్తే చర్యలు తీసుకుంటాం.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయల ఊరేగింపు



స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం ద్వాదశి సందర్భంగా మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయులను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవలో భాగంగా ఉత్సవ మూర్తిని ఊయలలో ఉంచి ఊగించారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తి శ్రద్ధలతో ఉరుసు

మంత్రాలయం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం, మంత్రాలయం, వగరూరు, మాలపల్లి, రాంపురం, కాచాపురం, తిమ్మాపురం గ్రామాల్లో దస్తగిరి స్వామి ఉరుసు మహోత్సవాలు భక్తులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం వగరూరులో టీడీపీ నియోజకవర్గ నాయకులు రఘునాథరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య పవన్ కుమార్ రెడ్డి, ఎస్‌ఎం గోపాల్ రెడ్డి, గోపాల్‌లు ప్రత్యేక పూజలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మంత్రాలయం, మాధవరం ఎస్‌ఐలు పరమేశ్ నాయక్, విజయకుమార్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, ఆలంబాషా, షేక్షావలి, షఫీ, అబ్దుల్లా, కాశీంవలి, రజాక్, రహంతుల్లా, ఖాజా పాల్గొన్నారు.

నేడు గుడేకల్లులో 'పల్లెపండుగ'

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడేకల్లు గ్రామంలో బుధవారం పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీవో విజయ్‌మోహన్ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు. గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజలు చేస్తారన్నారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలన్నారు.

విద్యుత్ బోర్డులను కాల్చివేసిన దుండగులు

గోనెగండ్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంజహళ్లి గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే మూడు తాగునీటి బోర్ల విద్యుత్ బోర్డులను గుర్తు తెలియని దుండగులు కాల్చివేశారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడింది. సర్పంచ్ రాముడు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామానికి తాగునీటి బోర్లకు విద్యుత్ సరఫరా చేసే మూడు బోర్డుల స్టాటర్ కాయిల్స్ ఇతర సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారన్నారు. రెండు రోజుల్లో కొత్త బోర్డులను ఏర్పాటు చేస్తామని గ్రామానికి తాగునీటి సమస్య రాకుండా చూసుకుంటామని వారు తెలిపారు.

పెచ్చులూడుతున్న తరగతి గది పైకప్పులు

- పూర్తి కాని నాడు-నేడు పనులు
- చెట్ల కింద విద్యార్థినుల చదువులు
- అధికారుల పర్యవేక్షణ లోపం

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. దీంతో విద్యార్థినులకు చెట్ల కింద చదువులు తప్పడం లేదు. ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని సోమప్ప బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల సంఖ్యలో రాష్ట్రంలోనే అతి పెద్ద రెండవ పాఠశాలగా గుర్తింపు పొందింది. పాఠశాలలో 6నుంచి 10వ తరగతి వరకు 3,750 మంది విద్యార్థినులు చదువుతున్నారు. అవసరమైన తరగతి గదులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఎప్పుడో పాఠశాల ప్రారంభంలో నిర్మించిన తరగతి గదులు కావడంతో తరగతి గదుల్లో పైకప్పుల పెచ్చులూడుతున్నాయి. దీంతో విద్యార్థినులు భయపడి పాఠశాల ఆవరణంలో ఉన్న చెట్ల కింద కూర్చోవలసిన దుస్థితి ఏర్పడింది.



తరగతి గదిలో పెచ్చులు ఊడిన పైకప్పు

అసంపూర్తిగా నాడు-నేడు పనులు గత ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పనులు కింద మాచాని సోమప్ప బాలికోన్నత పాఠశాలను ఎంపిక చేసి 20 రూములకు గాను రూ. 2కోట్ల నిధులు కేటాయించింది. ఇందులో భాగంగా మొదటి విడతలో ఎనిమిది రూములు నిర్మాణాన్ని ప్రారంభించింది. నాలుగు రూములకు గాను పిల్లర్ల పనులు జరుగుతున్నాయి. ఇందుకుగాను ఇప్పటి వరకు రూ. 89లక్షలు ఖర్చు చేశారు. ఉన్న ఎనిమిది రూములు కూడా అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో విద్యార్థినులు చెట్ల కింద కూర్చొని పాఠాలు వింటున్నారు.



చెట్ల కింద చదువుకుంటున్న విద్యార్థినులు



పూర్తి కాని నాడు-నేడు తరగతి గది

రాఘవేంద్ర స్వామి మఠానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి కర్ణాటకలోని చిక్ మంగళూరుకు చెందిన రమేష్ నేత్రావతి అనే భక్తురాలు రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. మంగళవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని దైనందిక సేవకు విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

మంచాలమ్మకు పంచామృతాభిషేకం

మంత్రాలయం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అశ్వయుజ మాసం సందర్భంగా మంగళవారం మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, విశేష పంచామృతాభిషేకం చేసి పట్టుచీర, బంగారు,వెండి ఆభరణాలతో అలంకరించారు. పీఠాధిపతి మహా మంగళహారతులు ఇచ్చారు. భక్తులు మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

తగ్గుముఖం పట్టిన తుంగభద్ర

65 వేల క్యూసెక్కుల నీటితో పరవళ్లు



మంత్రాలయం వద్ద తగ్గిన తుంగభద్ర వరద ప్రవాహం

మంత్రాలయం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠం వద్ద తుంగభద్ర నది ప్రవాహం తగ్గుముఖం పట్టింది. మంగళవారం సాయంత్రం మంత్రాలయం వద్ద 309.250 మీటర్ల నీటి మట్టంతో 65 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. టీబీ డ్యాం నుంచి 91,720 క్యూసెక్కుల నీరు నదికి విడుదల చేసిన విషయం తెలిసిందే. మంగళవారం సాయంత్రం 13,590 క్యూసెక్కులకు నీటిని తగ్గించారు. డ్యాంలోకి ఇన్‌ఫ్లో 26,026 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. దీంతో తుంగభద్రనది రెండువైపులా సరిహద్దులను తాకుతూ ప్రవాహం శాంతించింది. దర్శనార్థం వచ్చి నదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు శ్రీమఠం అధికారులు మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నదీతీర గ్రామాల ప్రజలను తహసీల్దారు రవి, సీడబ్ల్యూసీ, మంత్రాలయం ఎస్‌ఐ పరమేష్ నాయక్, శ్రీమఠం అధికారులు భక్తులను అప్రమత్తం చేస్తున్నారు.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి

కేజీబీఎస్ రాష్ట్ర నాయకుడు ఎండీ ఆనంద్‌బాబు



మాట్లాడుతున్న ఎండీ ఆనంద్‌బాబు

ఎమ్మిగనూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అందరికి ఉపయోగపడే వృత్తిని నిర్వహిస్తున్న కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలని కేజీబీఎస్ రాష్ట్ర నాయకుడు ఎండీ ఆనంద్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో కాటికాపరుల సంఘం జిల్లా స్థాయి సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న వృత్తులన్నీ ఒకవైపు అయితే దళితులు భుజానెత్తుకొని నిర్వహిస్తున్న వృత్తులన్నీ సమాజమంతటికి ఉపయోగపడే వృత్తులన్నారు. ఓట్ల కోసం మాత్రమే ముందుకు వచ్చే రాజకీయ పార్టీలన్నీ కాటికాపరులందరిని 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి భృతిని కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేజీబీఎస్ జిల్లా కార్యదర్శి కృష్ణ, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు రంగమ్మ, జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, నాయకులు కరుణాకర్, సుమాల ఆంథోని, మారయ్య, హనుమంతు, తిమ్మన్న, రాజారమేష్, యువరాజు, గోపాల్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

కోసిగి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పాటు వాతావరణ శాఖల హెచ్చరికలతో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. మంగళవారం కోసిగి మండల పరిధిలోని అగసనూరు సమీపంలో తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టను కోసిగి తహసీల్దార్ నిత్యానందరాజుతో కలిసి సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఎగువ కర్ణాటక రాష్ట్రం పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తుంగభద్ర నదికి వరద పోటెత్తిందని, డ్యాం నుంచి సుమారు 50వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయడంతో తుంగభద్రకు వరద పోటెత్తిందన్నారు. ఎలాంటి ప్రమాదం లేదన్నారు. రెండు రోజుల పాటు రైతులు తమ పంట ఉత్పత్తులను కాపాడుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఆర్‌ఐ శ్రీరాములు, సీనియర్ అసిస్టెంట్ తిక్కస్వామి, వీఆర్వోలు బసవరాజు, బాలస్వామి, టీడీపీ నాయకులు కురువ అయ్యన్న తదితరులు ఉన్నారు.

కందుకూరులో స్థల పరిశీలన: రెండు రోజుల పాటు అధిక వర్షాలు పడుతాయని రాష్ట్ర ప్రభుత్వం, వాతావరణ శాఖ అధికారుల ఆదేశాలతో మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కోసిగి మండల పరిధిలోని కందుకూరు జడ్పీహెచ్ పాఠశాలలో స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ నిత్యానందరాజుతో కలిసి నదీతీర గ్రామాల ప్రజలకు పునరావాస కేంద్రం స్థల పరిశీలన చేసినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. మండలంలో తుంగభద్రనది వరద కూడా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నదీతీర గ్రామాలైన కడిదొడ్డి, అగసనూరు, సాతనూరు, తదితర గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్‌ఐ శ్రీరాములు, సీనియర్ అసిస్టెంట్ తిక్కస్వామి, వీఆర్వోలు బసవరాజు, బాలస్వామి తదితరులున్నారు.



అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్

భక్తులు అప్రమత్తంగా ఉండాలి : సబ్ కలెక్టర్

మంత్రాలయం: మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మంగళవారం రాత్రి మంత్రాలయం సమీపంలోని తుంగభద్ర నది నీటి మట్టాన్ని పరిశీలించారు. భక్తులు స్నానాలకు వెళ్లే సమయంలో మఠం యజమాన్యంతో కలిసి పోలీసులు, రెవెన్యూ అధికారులు నది ఒడ్డున అప్రమత్తంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ ఎస్.రవి, డిప్యూటీ తహసీల్దార్ సరస్వతి, వీఆర్వో భీమన్నగౌటు, శీముడు, నాగభూషణం రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వద్దు: ఎంపీడీవో

మంత్రాలయం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో త్వరలో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో శోభారాణి, ఈవోఆర్డీ ప్రభావతిదేవి, పంచాయతీరాజ్ ఏఈఈ మల్లయ్యలు అన్నారు. మంగళవారం సాయంత్రం ఎంపీడీవో సమావేశ భవనంలో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏపీవో తిమ్మారెడ్డి, ఈసీ శ్రీనివాసులు, ఏవో రాధ, టెక్నికల్ అసిస్టెంట్లు పవన్ కుమార్, రంగమ్మ, శివకుమార్, భీమేష్, భవాని, సాహితి, కవిత, రిజ్వానా, పద్మలు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని జయప్రదం చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 17న జరిగే వాల్మీకి జయంతిని జయప్రదం చేయాలని ఏపీ వాల్మీకి సంఘం నాయకులు రామప్ప, తిమ్మయ్య, నాగేష్, ఆనంద్, రాజులు కోరారు. మంగళవారం తహసీల్దార్ శేషఫణి, ఎస్‌ఐ శ్రీనివాసులను కలిసి వాల్మీకి జయంతికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నరసింహులు, గోరంట్ల, వెంకటేష్, నరసప్ప, పులికొండ, దస్తగిరి, నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతి

గోనెగండ్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి జయంతి వేడుకలను రాష్ట్రపండుగగా నిర్ణయించడం హర్షించదగ్గ విషయమని టీడీపీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు అన్నారు. ఈనెల 17న వాల్మీకి జయంతి వేడుకలకు ఘనంగా జరుపుకోవాలని వాల్మీకులను కోరారు. వాల్మీకు అభివృద్ధికి టీడీపీ సహకరిస్తుందని అన్నారు.

పూలచింత ఉపాధ్యాయుడిపై విచారణ

నందవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలచింత గ్రామంలో ప్రధానోపాధ్యాయుడు నరేష్‌పై మంగళవారం డిప్యూటీ డీఈవో వెంకటరమణరెడ్డి విచారణ చేపట్టారు. గ్రామంలోని విద్యార్థులను కులం పేరుతో దూషించి, విద్యార్థులకు కోడి గుడ్లు పంపకుండా ఉపాధ్యాయులు చిన్నచూపుచూడడం సరికాదని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. దీంతో అధికారులు స్పందించి విచారణకు ఆదేశించారు. కులం పేరుతో విద్యార్థులను దూషించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌ఫ్, పీఎస్‌యూ సురేష్ డిమాండ్ చేశారు. దళిత కాలనీలో విచారణ చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవో సుదర్శన్ రెడ్డి, నాగభూషణం, ఇజ్రాయేల్, వసంత్, పెద్దయ్య పాల్గొన్నారు.

పొలంబడిపై అవగాహన

గోనెగండ్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పొలం బడి కార్యక్రమంలో అనేక విషయాలు తెలుస్తాయని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బీ అగ్రహారం గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, రైతులు పత్తి పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పొలం బడి కార్యక్రమం చేపట్టడం వల్ల పంటలపై రైతులకు అవగాహన వస్తుందన్నారు. అలాగే ప్రతి రైతు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రంగారెడ్డి, గ్రామ నాయకులు రంగన్న, రాముడు, వ్యవసాయ సహాయకులు మల్లికార్జున, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాభివృద్ధి: ఎమ్మెల్యే

నందవరం, అక్టోబరు 15 (ఆంధజ్యోతి): పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మాచాపురం గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో గ్రామాలు అభివృద్ధి జరగలేదన్నారు. కేవలం దోచుకోవడం... దాచుకోవడమేనని తెలిపారు. అన్ని గ్రామాలను ప్రణాళిక ప్రకారం తయారు చేశామన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఏఈ నరసింహులు, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో పులయ్య, టీఈ బసీర్, టీడీపీ నాయకులు బండేగురుస్వామి, క్లస్టర్ ఇన్‌చార్జులు మాచాపురం కాశీంవలీ, ధర్మాపురం గోపాల్, పార్టీ మండల కన్వీనర్ డీవీ రాముడు, పీరసాబ్, వలీ, జబ్బార్, లచ్చప్పనాయుడు, వీరేష్ , జజారి, నరసింహులు, మాచాపురం వెంకట్రామముడు, పాల్గొన్నారు.

కౌతాళం: గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దుదామని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం మండల పరిధిలోని ఎరిగేరి, కామవరం, ఉరుకుంద గ్రామాలలో మండల టీడీపీ అధ్యక్షుడు ఉలిగయ్య, మండల అధికారులతో కలిసి ముఖ్య అతిథిగా రాఘవేంద్రరెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌళిక వసతులను కల్పించి గ్రామాలను అభివృద్ధి చెందేలా చేస్తానని ఒక్క కౌతాళం మండలానికి పల్లె పండుగ కింద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి 2.5 కోట్లు మంజూరు చేయించానని తెలిపారు. అనంతరం గ్రామంలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లకు భూమి పూజ చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున స్వామి, ఎంపీడీఓ సుబ్బరాజు, వివిధ శాఖల అధికారులు టీడీపీ నాయకులు అడివప్పగౌడ్, వెంకటపతిరాజు, టిప్పుసుల్తాన్, రామలింగ, బసవరాజు, రాజానందు పాల్గొన్నారు.



దైవందిన్నెలో భూమి పూజ చేస్తున్న అధికారులు, నాయకులు

మంత్రాలయం: పల్లెల్లో సీసీ రోడ్లతో పండుగ కళ వచ్చిందని మాజీ సర్పంచ్ ఎన్.రఘునాథరెడ్డి, మాజీ జడ్పీటీసీ మాలపల్లి లక్ష్మయ్య అన్నారు. మంగళవారం మండలంలోని వగరూరు, వి.తిమ్మాపురం, బూదూరు గ్రామాల్లో పల్లె పండుగలో భాగంగా ఎంపీడీవో శోభారాణి, పంచాయతీ రాజ్ ఏఈఈ మల్లయ్య, ఉపాధి ఏపీవో తిమ్మారెడ్డి, ఈవోఆర్డీ ప్రభావతిదేవి ఆధ్వర్యంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.ఎం.గోపాల్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, గోపాల్, రాజు, హనుమంతు, శివరాముడు, వీరేష్, స్రవంతి, తిమ్మప్ప, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులకు అధికారులు, టీడీపీ నాయకులు భూమిపూజ కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీవో మణిమంజరి, పీఆర్‌ఏఈ శివశంకర్ మాట్లాడుతూ ఎన్ఆర్‌ఈ జీఎస్ నిధుల కింద రూ. 15లక్షలతో సీసీరోడ్డుకు పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజు, అబ్దుల్, మల్లేష్ ప్రభుదాస్, రాముడు, హనుమన్న, యోసేపు, శ్రీరాములు, ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు మండల పరిధిలోని దైవందిన్నె, కలుగొట్ల గ్రామాల్లో మంగళవారం పల్లెపండుగ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఎంపీడీవో బంగారమ్మ, ఏపీవో విజయ్‌మోహన్ హాజరై పలు అభివృద్ధి పనులకు గ్రామ నాయకులతో భూమి పూజలు చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శరణబసవ, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధి కోసం పల్లె పండుగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, పల్లె పండుగ కార్యక్రమం దేశానికే ఆదర్శమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి అన్నారు. మంగళవారం కోసిగి మండల పరిధిలోని సాతనూరు, చిర్తనకల్ గ్రామాల్లో పల్లె పండుగను నిర్వహించారు. సాతనూరు గ్రామానికి రూ.6 లక్షలు, చిర్తనకల్ గ్రామానికి రూ.10 లక్షలతో సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీవో చంద్రశేఖర్, పీఆర్ ఏఈ మాణిక్, ఈవోపీఆర్డీ హరూన్ రషీద్, పంచాయితీ కార్యదర్శులు మహ్మద్ ఆలీ, ఈరన్న, రామరాజు, అనురాధ, టీడీపీ నాయకులు జ్ఞానేష్; తోవి రామకృష్ణ, నాడిగేని అయ్యన్న, చింతలగేని నర్సారెడ్డి, వీరేష్, సొట్టయ్య, నాగేంద్ర, వెంకటేశ్, రామిరెడ్డి, నర్సప్ప, హనుమప్ప, ఈరయ్య, గుండేష్, తిక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాచాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



ఉరుకుందలో భూమి పూజలో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



సాతనూరులో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు